నవతెలంగాణ
1
వరంగల్-ములుగు
ఆదివారం ఆగస్టు 04, 2024 www.navatelangana.com

19 అక్రమ నిర్మాణాల తొలగింపు

హై కోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాల తొలగింపు

నవతెలంగాణ-వరంగల్

హై కోర్టు ఆదేశాల మేరకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, పోలీసుల వారి సహకారంతో శనివారం ఉదయం జీడబ్ల్యూఎంసీ లిమిట్స్‌లోని ఎఫ్టిఎల్ పరిధిలో గల 19 అక్రమ నిర్మాణాలను తొలగించారు. బల్దియా సిటీ ప్లానర్ శైలజ సారథ్యంలో కోట చెరువు ఎఫ్టిఎల్ పరిధిలో 4చిన్న వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో 8నిర్మాణాలతో పాటు హన్మకొండ జిల్లా పరిధి బంధం చెరువు ఎఫ్టిఎల్‌లో ఉన్న 7నిర్మాణాలైన ఏసిసి షేడ్స్, కాంపౌండ్ వాల్స్ ను తొలగించారు.



విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పర్చుకోవాలి

సీడబ్ల్యూసీ జిల్లా చైర్‌పర్సన్ చందర్‌రావు

విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేసిన సేవా సంస్థ

నవతెలంగాణ కాశిబుగ్గ

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వరంగల్ జిల్లా చైర్ పర్సన్ హనుమండ్ల అనిల్ చందర్‌రావు అన్నారు. సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం దేశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 400మంది విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి అయిత ఉషాభాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడబ్ల్యుసీ జిల్లా చైర్ పర్సన్ చందర్‌రావు మాట్లాడుతూ జీవిత లక్ష్యాలను సాధించడానికి చదువు ఒక్కటే సరైన మార్గమని,విద్యార్థులు చదువుపై దృష్టి సాధించి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సేవా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు జూపాక రత్నప్రణయ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీకి ఆర్థిక సహాయాన్ని అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సేవా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కుమ్మరి బాబు రాజ్ ఉపాధ్యక్షుడు గంటి ఆనందం సహాయ కార్యదర్శి రోకుల లక్ష్మి జగన్ కోశాధికారి దూలం సందీప్ కమిటీ సభ్యులు కుమ్మరి నిఖిల్, నయీమ్, పవన్ కుమార్, భరత్, సింధు ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పాలడుగుల సురేందర్ పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం చక్రపాణి, సమ్మయ్య, నిశాంత్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ, సీఏలను విధుల నుండి తొలగించాలి

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింత నెక్కొండ గ్రామంలోని ఆదర్శ మహిళా పొదుపు సంఘం లీడర్లను పక్కన పెట్టి... సంఘంలోని నలుగురు సభ్యులతో సీసీ సుధాకర్, సీఏ రాజయ్య ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమాలకు పాల్పడుతున్న వీరిని వెంటనే విధుల నుండి తొలగించాలని లీడర్లు తౌడోజు సువర్ణ, మడూరు లక్ష్మి ఆరోపించారు. మండలంలోని చింతనెక్కొంలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. సీఏ రాజయ్య తమను బెదిరింపులకు గురి చేస్తూ ఎక్కువ మాట్లాడితే రుణాలు ఇప్పించనంటూ బెదింపులకు పాల్పడు తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సీసీ సుధాకర్ కూడా రాజయ్యకు వంత పాడుతున్నాడని వాపోయారు. సంఘంలోని డబ్బులను ఇష్టారాజ్యంగ వాడుకుంటున్నారని, అడిగినందుకు మమ్మల్ని మీరు గ్రూపులో ఉంటే ఉండండి... లేకపోతే వేరే గ్రూపులోకి వెళ్లండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఐకేపీ ఏపీఎం, డీపీఎంలు స్పందించి వెంటనే రాజయ్య, సుధాకర్‌లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.



నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నవతెలంగాణ-సంగెం

నిరుపేదలకు, బడుగు, బలహీనవర్గాలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం సంగెం, ఖిలా వరంగల్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 51మంది లబ్ధిదారులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో రూ.16లక్షల65వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, 25మంది లబ్ధిదారులకు రూ.25లక్షల2వేల900 విలువ గల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు త్వరలో నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, కాపులకనపర్తి సొసైటీ చైర్మన్ దొమ్మాటి సంపత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గేదెల పెంపకం కోసం రుణాలు

సెర్ప్ డీపీఎం దయాకర్

నవతెలంగాణ-నెక్కొండ

మహిళా శక్తి పథకం కింద మహిళ సంఘాల సభ్యులకు గేదెల పెంపకం కోసం పంపిణీ కోసం రుణాలను అందించనున్నట్లు సెర్ప్ డీపీఎం దయాకర్ అన్నారు. నెక్కొండ భారతి మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాస ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం కింద గేదల పెంపకం గురించి లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డీపీఎం మునిగాల దయాకర్ హాజరై మాట్లాడుతూ మహిళా శక్తి ప్రోగ్రాం కింద గేదెల కోసం రుణాలు ఇప్పించి మహిళలను ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహి స్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి మమత మాట్లాడుతూ లబ్ధిదారులకు గేదె కొనుగోలులో ఎంపిక విషయాల దగ్గర నుండి గేదే యొక్క పోషణ , పశుగ్రాసం నిర్వహణ విధానాల గురించి సభ్యులకు వివరించినారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు రవీందర్, ఏకాంబ్రం, మాణిక్యం, వెంకటయ్య, వీవోఏలు ఏకాంబ్రం, వెంకటరమణ, దివ్య, మధుకర్, గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన తక్కలపల్లి గోపాల్‌రావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఇల్లంద గ్రామానికి చెందిన తక్కలపల్లి సుధాకర్ సతీమణి అంజలిదేవి అనారోగ్యంతో మరణించగా నేడు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కడారిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పింగిల్లి రాజామల్లారెడ్డి తండ్రి పెద్ద కొండారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన నాంపల్లి సమ్మయ్య సతీమణి భాగ్యమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆమెకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, మైనారిటీ నాయకులు మహమ్మద్ చోటు వలీ, కృష్ణ రెడ్డి, పోశాల వెంకన్నగౌడ్ పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, కౌన్సిలర్ సుధీర్, మాజీ జడ్పీటీసీలుకమ్మగోని ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని చింతనెక్కొండ, ఏనుగల్లు ,చౌటపల్లి మరియు పర్వతగిరి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో ఆదివారం 33కేవీ లైన్ నిర్వహణ పనుల నిమిత్తము ఉదయం 8.30 గంటల నుండి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా పిలిపివేయబడునని పర్వతగిరి ఏడీఈ చంద్రమౌళి తెలిపారు.

హన్మకొండ ఏసీపీ కార్యాలయంలో సీపీ తనిఖీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వార్షిక తనిఖీలలో భాగంగా హన్మకొండ ఏసీపీ కార్యాలయాన్ని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తనిఖీ చేశారు. శనివారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా హన్మకొండ ఏసీపీ కార్యాలయానికి చేరుకోగానే ఏసీపీ దేవేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయంలో సిబ్బంది పనితీరును పోలీసు కమిషనర్ పరిశీలించారు. కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవేందర్‌రెడ్డికి సీపీ పలు సూచనలు చేశారు. అధికారులు, సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయడంతోపాటు కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసేందుకు స్టేషన్ అధికారులకు సహకరించాలన్నారు. ప్రధానంగా రౌడీషీటర్ల వ్యవహారంపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. కొత్తగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కొత్తగా రౌడీ షీట్లు తెరవాలన్నారు. గతంలో జరిగిన చోరీ కేసులను పరిష్కరించడంతో పాటు చోరీలను కట్టడి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి నిరంతరం పర్యవేక్షణ వుండాలన్నారు.ఈ తనిఖీలలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమాతో పాటు హన్మకొండ డివిజన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు

వచ్చే నెల 21,25,30 తేదీల్లో మూడు విడుతలుగా నిర్వహణ ?

సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండటంతో గ్రామాల్లో కోలాహలం

పార్టీ మద్దతు కోసం ఆశావాహుల హైరానా..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలు సెప్టెంబర్ 21, 25, 30 తేదీల్లో మూడు విడతల్లో జరుగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు అక్టోబర్ 1వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ వార్తలు ఇప్పటికే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో గ్రామాల్లో కొలహలం నెలకొంది. తొలుత కులగణన జరిగాక పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా, ఇందుకు సమయం అధికంగా అవసరమవుతుండడం, ఈలోపు కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాద ముండడంతో పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి రంగం సిద్ధమైంది. వరంగల్ జిల్లాలో 323 గ్రామ పంచాయతీ లున్నాయి. హన్మకొండ జిల్లాలో 208, జనగామ జిల్లాలో 209, భూపాలపల్లి జిల్లాలో 223, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174 పంచాయతీలున్నాయి.



పార్టీ మద్దతు కోసం హైరానా..

పంచాయతీల పాలకవర్గాల కాల పరిమితి ముగిసిన నాటి నుండే వచ్చే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి గ్రామస్థాయిలో రాజకీయ పార్టీల నేతలు ఎమ్మెల్యేల నుండి గ్రీన్‌సిగ్నల్ కోసం కసరత్తు చేయడం ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పలువురు నేతలు ఇప్పటికే సన్నద్ధమై రిజర్వేషన్ల మార్పులపై ఆరా తీస్తున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు పెట్టి సర్పంచ్‌లుగా ఎన్నికైన నేతలు గ్రామాభివృద్ధికి వెచ్చించిన నిధులు రాకపోవడం, అప్పులు తెచ్చి పనులు చేసి ఇబ్బందులు పడుతున్న దుస్థితి వున్నా నేతలు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్నారు.

ఇప్పటికే ఎమ్మెల్యేలు సైతం మండలాలవారీగా పంచాయతీలలో పార్టీ జెండాను ఎగురవేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. ఈ ఎన్నికలు కొత్తగా గెలిచిన ఎమ్మె ల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. పంచాయతీలను పెద్ద మొత్తంలో గెలుచుకొని నియోజకవర్గంలో పట్టు సాధించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తుండగా, విపక్ష నేతలు స్థానిక ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్‌కు చెక్ పెట్టాలని ప్రయత్నిస్తున్నాయి. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఒకవైపు రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వానికి, శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్ తదితర పార్టీలు సైతం ఈ ఎన్నికల్లో గట్టి పోటీనిచ్చి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్నాయి.

గ్రామాల్లో కొలహలం..

పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్ మాసంలో నిర్వహించే అవకాశముందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండడంతో గ్రామాల్లో కొలహలం నెలకొంది. గత ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి సర్పంచ్‌లైన నేతలు తీవ్రంగా నష్టపోయినట్లు ప్రచారం జరుగుతున్నా, పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి గ్రామస్థాయి నేతలు ఎవరూ వెనుకంజ వేయకపోవడం గమనార్హం. దీంతో పోటీ కాంగ్రెస్, విపక్షాల మధ్య రసవత్తరంగా మారే అవకాశాలున్నాయి. ఇప్పటికే రిజర్వేషన్లపై ఆరాతీస్తూ అవకాశాలను సానుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తే గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మరింత ప్రస్ఫుటం కానుంది.

కాసం కృష్ణమూర్తి ఆశయ సాధన కోసం పోరాటం

వ్యకాస జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య

నవతెలంగాణ -నర్సంపేట

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా మహోత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటంలో తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన నాయకుడు కాసం కృష్ణమూర్తి ఆశయ సాధన కోసం పోరాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొరబోయిన కుమారస్వామి అన్నారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో కాసం కృష్ణమూర్తి 18వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.



తెలంగాణ సాయుధ పోరాట కాలంలో తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజలందరినీ సమీకరించి గ్రామాల్లో గ్రామ దళాలను ఏర్పాటు చేసి నైజాం నవాబు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల వైపు నడిపించే విధంగా ప్రజలను సంసిద్ధులను చేసి తిరుగుబాటు బావుటా ఎగుర వేసిన మహా నాయకుడు కృష్ణమూర్తి అన్నారు. తెలంగాణ విముక్తి కావడానికి కృష్ణమూర్తి అనేక త్యాగాలు చేయడమే కాకుండా నిర్బంధ జైలు జీవితాన్ని కూడా గడిపారన్నారు. రజాకారలు నిర్బంధం కొనసాగించిన సందర్భంలో అనేక సంవత్సరాలు రహస్య జీవితం గడిపారని అన్నారు. నేటి పాలకవర్గ పార్టీలు వ్యవసాయ కార్మికులను అణచబడిన వర్గాలను సంక్షేమ పథకాల ముసుగులో మోసం చేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నాయని, సంక్షేమ పథకాల ముసుగులో ప్రజలను వంచిస్తున్నారు. ఈ బూర్జువ పాలకవర్గాలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు నమిండ్ల స్వామి, జిల్లా నాయకురాలు మొలుగోజు శారద, రుద్రారపు లక్ష్మి, మాదాసి శ్రీను, గట్ల నరసింహారావు పాల్గొన్నారు.

సమతుల్యమైన ఆహారంతో ఆరోగ్యం

జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లేనీనా

నవతెలంగాణ-వెంకటాపురం

బాలింతలు, గర్భిణీలు సమతుల్యమైన ఆహారంతో ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణ లత లేనీనా పేర్కొన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా పెరికవీధి అంగన్వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు అ వగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలు వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ముత్తమ్మ సూ పర్ వైజర్ చంద్ర కళ పాల్గొన్నారు.

తాడ్వాయి : డబ్బా పాలు వద్దు.. తల్లిపాలే ముద్దని తాడ్వాయి ఐసిడిఎస్ సిడిపిఓ మల్లీశ్వరి తెలిపారు. శనివారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నవ తెలంగాణతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీలలో అన్ని అంగన్వాడి సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలపై అందరి సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వాబా(వరల్డ్ అలైన్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ ఎక్షన్) సంస్థ పర్యవేక్షణలో డబ్ల్యూ హెచ్ఓ, యూనిసెఫ్, బిపి ఎస్ ఐ, వంటి అంతర్జాతీయ జాతీయ సంస్థల అనుబంధంగా జరుపుతున్నారని తెలిపారు. తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యగా ఉంటారని, పుట్టిన పిల్లలకు వెంటనే తల్లిపాలు ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు.



గంగారం గ్రామంలో : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కారమని బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని, దీంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని గంగారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జయప్రద అన్నారు. శనివారం మండలంలోని గంగారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల భారీ ర్యాలీ నిర్వహించి, కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయప్రద, అంగన్వాడి టీచర్లు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సుమలత, తేనెకుంట్ల విజయ, నాగలక్ష్మి, పూనెం విజయ, రాజ్యలక్ష్మి, ఏఎన్ఎం సునీత, ఆశా భాగ్యలక్ష్మి, తల్లులు, పిల్లలు, విద్యార్థులు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట : మండలంలోని పస్రా గ్రామం అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రణధీర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద మాట్లాడారు. కార్యక్రమంలో వై ఆర్ జి కేర్ సంస్థ లింక్ వర్కర్ కిషన్ పాల్గొన్నారు. అనంతరం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఊర్మిళ, పద్మావతి, పద్మావతి, యస్ భాగ్య, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్త శ్యామల, ఆయమ్మ రాజ్యం పాల్గొన్నారు.

సస్య రక్షణలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్స్ సౌమ్య, రాజు

నవతెలంగాణ-సంగెం

పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వ విద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు ఆధ్వర్యంలో అమలవుతున్న అధిక సాంద్రత పత్తి సాగుపై చింతలపల్లి గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ సౌమ్య, డాక్టర్ రాజు నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో తక్కువ దూర పద్ధతిలో సాగు చేస్తున్న ప్రత్తి(90ఇ30 సెం.మీ)పొలంలో క్షేత్ర సందర్శన నిర్వహించారు.



ఈ పరిశీలనలో భాగంగా పత్తి పంట ప్రస్తుతం 40-45 రోజులలో దశలో ఉన్నందున అధిక సాంద్రతలో సాగు చేసే రైతులు మొదటి దఫా పెరుగుదల నియంత్రణకారి అయిన మేపిక్వాట్ క్లోరైడ్‌ను ఎకరానికి 200మిల్లీ లీటర్లు పిచికారి చేయాలని డాక్టర్ సౌమ్య సూచించారు. సస్య రక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు పేను బంక, పచ్చ దోమ ఉదతి, గులాబి రంగు పురుగు ఆనవాళ్లు గమనించారు. రసం పీల్చు పురుగుల ఉదతి తగ్గించడానికి జిగురు అట్టలు పెట్టుకోవాలని, వేపనూనె 5శాతం పురుగు మందుతో సల్ఫాక్స్ ఫ్లోర్ 0.75గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. గులాబీ రంగు పురుగును గమనించడానికి ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చుకుని, అనుగుణంగా సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు విత్తన సంస్థ ఏరియా మేనేజర్ మురళీ మోహన్, కేవీకే యంగ్ ప్రొఫెషనల్స్ హర్ష వర్ధన్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

నగరంలో పచ్చదనం పెంచడమే లక్ష్యం

నగర మేయర్ గుండు సుధారాణి

నవతెలంగాణ-వరంగల్

నగరంలో పచ్చదనం పెంచడమే లక్ష్యమని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఈ నెల 5నుంచి 9వరకు నిర్వహించనున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని కార్పొరేటర్ల సమన్వయంతో ప్రజల భాగస్వాములు చేస్తూ విజయవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ నిర్వహణపై బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ శనివారం అన్ని విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి సమర్థ నిర్వహణకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశనంలో రాష్ట్రంలో పారిశు ధ్యం, పచ్చదనాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా 'స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బల్దియా వ్యాప్తంగా ఉన్న 66 డివిజన్‌లకు ప్రత్యేక అధికారులను నియ మించినట్టు తెలిపారు. డివిజన్ కార్పొరేటర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు, ఆర్‌పిలను సమన్వయం చేసుకుంటూ నగర ప్రజల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, ఎస్సీలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య సీఎంహెచ్వో డా. రాజేష్, సిటీ ప్లానర్ శైలజ, హార్టిక ల్చర్ అధికారి రమేష్, డిప్యూటీ కమిషనర్లు రవీం దర్, ప్రసన్న రాణి, టిపిఆర్‌ఓ రాజేష్, పన్నుల అధి కారి శ్రీనివాస్, మెప్మా టీఎంసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి సాయం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని లింగాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఊకె జగన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దండగుల మల్లయ్య మాజీ జెడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊకే జగన్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పాయం నరసింహారావు, పెండకట్ల కృష్ణ, చెన్నూరి నర్సయ్య, చెన్నూరు వెంకన్న, ఎండీ రషీద్, పెండకట్ల బాలరాజు, చెన్నూరి కన్నయ్య, అనిల్, సారయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమ సమాజ నిర్మాణానికి స్నేహ బంధాలు అవసరం

ములుగు జిల్లా ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనినా

నవతెలంగాణ-వెంకటాపురం

ఆధునిక సమాజంలో అత్యంత ముఖ్యమైన పాత్ర స్నేహానిది అని అటువంటి ఉన్నతమైన స్నేహితుల ఎంపికలో నేటి తరం యువత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమ సమాజ నిర్మాణానికి ఉన్నతమైన స్నేహ బంధాలు ఎంతో అవసరమని ములుగు జిల్లా ప్రత్యేక అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'నాకు నచ్చిన నా నేస్తం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కళాశాల అకాడమిక్ ఇంచార్జ్ డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన 'స్నేహితుల దినోత్సవ' సభకు, ఆత్మీయ అతిథిగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.వి సత్యనారాయణ, హాజరై మనం ఎంపిక చేసుకునే స్నేహితులను బట్టే మన భావి జీవితాలు ఆధారపడతాయని వివరించారు.కళాశాల ఉపన్యాసకులు పొన్నాడ వెంకట రామకృష్ణ, కె. రాంబాబు, రోషిత మాట్లాడారు. వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ, తతీయ, స్థానాలు పొందిన, సి హెచ్. భవ్య హర్షిణి, (బైపిసి) కె, చరణ్ (బైపిసి), యం. ప్రియ భవాని (యం.పి.సి)లతో పాటుప్రోత్సాహక బహుమతులు పొందిన కె. గాయత్రి, యం. మౌనికలకు పుస్తక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు పాల్గొన్నారు.



బాధితుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఏటూరునాగారం (ఐటీడీఏ)

మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందిన జహంగీర్ కుటుంబాన్ని శనివారం మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్ మృతుడి జహంగీర్ తండ్రి సయ్యద్‌ను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గుడ్ల దేవేందర్, ఖలీల్‌ఖాన్, నర్సింహా రావు, ఎల్లయ్య, గౌస్, లాలయ్య కరంచంద్‌గాంధీ, సులేమాన్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

మండలంలోని చెల్పాక గ్రామానికి చెందిన అట్టం పెద్ద సమ్మయ్య ఇటీవల మృతి చెందగా అతడి కుమారుడు అట్టం బాలకృష్ణకు 50కిలోల బియ్యం అందజేసినట్లు మండల అధ్యక్షుడు రఘు తెలిపారు.

సున్నం రాజయ్య 4వ వర్ధంతి

నవతెలంగాణ-వాజేడు

మండల కేంద్రంలో శనివారం సున్నం రాజయ్య 4వ వర్ధంతిని సీపీఐ(ఎం) మండలం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా రాజయ్య చిత్రపటానికి పూమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవలు చేసారని, నియోజకవర్గం సమస్యలే కాక కార్మికులు, రైతులు ఇతర అనేక సమస్యలపై అసెంబ్లీలో గలమెత్తిన నేత రాజయ్య అని కొనియాడారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నేత కరోనా మహమ్మారి ప్రజా ఉద్యమానికి దూరం చేసిందన్నారు.. ప్రజా ఉద్యమాలు కొనసాగించడమే రాజయ్యకు ఇచ్చే గణమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెజ్జరీ దామోదర్ బచ్చల కృష్ణబాబు, గుగ్గిళ్ల దేవయ్య, తోలేం ముత్తయ్య, బచ్చల సౌమ్య, అనిల్, అంగాల వెంకటస్వామి పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఎర్రబెల్లి స్వర్ణ పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండలంలోని కోనాపురం ఎస్సీ కాలనీలో రైతు ఎలికట్టె భాస్కర్ శనివారం విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మరణించగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ అక్కడికి వెళ్లి జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె వెంటకాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అఫ్సర్, కుమారస్వామి, ఎలికట్టె ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



నెక్కొండ ఎంపీడీవోగా గడ్డం దయాకర్

నవతెలంగాణ-నెక్కొండ

నెక్కొండ మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటిండెంట్‌గా విధులు నిర్వహి స్తున్న గడ్డం దయాకర్‌ను మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నియ మిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవోగా పని చేసిన వీరేశం జులై 31న పదవి విరమణ చేయడంతో సూపరింటిండెంట్‌కు బాధ్యతలు అప్ప గించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అవయవదాన దినోత్సవ బ్యానర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సుబేదారి



జాతీయ అవయవదాన దినోత్సవ బ్యానర్‌ను హనుమకొండ జిల్లా అదనపుకలెక్టర్ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తెలంగాణ నేత్ర అవయవ శరీరదాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు 3న జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ అవయవదాన దినోత్సవ కార్యక్రమం నిర్వహించి ప్రాముఖ్యత గూర్చి వివరించారు. అభాగ్యులను రక్షించడానికి అవయవ దానం ఎంతోఅవసరమని ఇది దైవకార్యం అన్నారు. ఒక్క అవయవ దాత 8 మందికి ప్రాణం పోస్తాడు అవయవ దానం చేస్తారని అందరం అవయవదానంపై అవగాహన కలిగి ఉండి, మరణ అనంతరం నేత్రశరీర అవయవ దానం చేసి మానవ మనుబడకు తోడ్పడుదామని పిలుపు నిచ్చారు. నేత్రదానాలు 300పైగాను, 122 శరీరదాన కార్యక్రమాలు, అవయవదాన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అనంతరం ప్రజా కవి కాళోజీ తొలి దేహదానం చేసిన స్ఫూర్తి దాత, వారి విగ్రహం వద్ద అవయవదాన దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి ఫ్లకార్డులతో నినాదాలు ఇచ్చి కార్యక్రమం నిర్వహించడమైనది.

ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లారెడ్డి, శంకర్‌రావుయాదవ్, ప్రధాన కార్యదర్శి, నిమ్మల శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, కేదారి, శ్రీలత రెడ్డి, మునగాల పద్మ నరసింహారాములు, మల్లిపెద్ది కృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ పంపిణీ

నవతెలంగాణ-శాయంపేట



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన దేవులపల్లి సాంబశివరావు స్మారకార్థం, ఆయన శత జయంతిని పురస్కరించుకొని శనివారం ఆయన కుటుంబ సభ్యులు ప్రాథమిక పాఠశాలకు రూ.30 వేల విలువగల వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ కు విద్యుత్ షాక్ రాకుండా ఉపాధ్యాయుల కోరిక మేరకు రూ.8వేల ఎర్త్ ఫిట్టింగ్ చేయించారు. ఈ సందర్భంగా సాంబశివరావు కుమారుడు శివప్రసాద్ మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తన తండ్రి 1952 నుండి 1958 వరకు పనిచేశారని, ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా పిఎస్ హెచ్‌ఎం బాలగంగాధర్‌రాజు, హై స్కూల్ హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయు లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ తుమ్మ లావణ్య, మామిడి తిరుపతమ్మ, మాజీ ఎస్ఎంసి చైర్మన్ వల్పదాసు వెంకటరమణ, వైస్ చైర్మన్ గాదె శ్రీలత రఘు, శివప్రసాద్ ను శాలువాతో సత్కరించి కతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్ట్స్ కళాశాలలో క్లీన్అండ్ గ్రీన్ కార్యక్రమం

నవతెలంగాణ-సుబేదారి

ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాలలో ప్రతి శనివారం నిర్వహించే పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలోని సైన్స్ విభాగాల ల్యాబ్‌ల ముందు ఉన్న చెత్తాచెదారాలను, ల్యాబ్ పరిసరాలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ఆధ్వర్యంలో ఉద్యోగస్తులు, విద్యార్థులు పర్యావరణ పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈనెల 6న జయశంకర్ 12వ స్మారకోత్సవం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఇంచార్జ్ కరుణ వాకాటి అధ్యక్షతన ఈనెల 6న మంగళవారం తెలంగాణా సిద్ధాంతకర్త డాక్టర్ కే. జయశంకర్ 12 వ స్మారక ఉపన్యాసం కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ సెనెట్ హాల్ లో నిర్వహిస్తునట్టు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. ఈ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో న్యూఢిల్లీ లోని సీనియర్ ఇంటర్నేషనల్ జర్నలిస్ట్ ఎస్.వెంకట్ నారాయణన్ చే ఫెడరలిజం ఇన్ ఇండియా అనే అంశం పై స్మారక ఉపన్యాసం ఏర్పాటు చేయడం జరిగిందని బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

కేరళ వరద బాధితులకు సీపీఐ విరాళాల సేకరణ

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ప్రకతి విలయంతో తీవ్రంగా నష్టపోయిన కేరళ వరద బాధితులను మానవతా దక్పథంతో ఆదుకోవాలని సీపీఐ హనుమకొం డ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి కో రారు. శనివారం హనుమకొండ చౌరస్తాలో కేరళ వరద బాధితుల సహాయార్థం సీపీఐ రాష్ట్రసమితి పిలుపులో భాగంగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సీపీఐ నాయకులు హనుమకొండ చౌరస్తా నుండి టైలర్ స్ట్రీట్, కుమార్ పల్లి నుండి అశోకా జంక్షన్ వరకు షాపుల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ కేరళలో గతం ఎన్నడూ లేని విధంగా ప్రకతి బీభత్సం సృష్టించిందని, వందలాది మందిమృతి చెందారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ స్పందించి మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా కేరళలో జరిగిన ప్రకతి విలయతాండవాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి ఏశబోయిన శ్రీనివాస్, సారంగపాణి, కొట్టెపాక రవి, రమేష్, దేవా, కొట్టె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని సాదోనిపల్లి, నూర్జహాన్ పల్లి గ్రామాలలోని అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల, డాక్టర్ విద్య శ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున్, ఏఎన్ఎం శోభ, అంగన్వాడీ టీచర్లు రాణి, కవిత, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అంగన్ వాడీ ల్లో పిల్లలకు సరైన పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సుపర్ వైజర్ పద్మావతి అన్నారు..శనివారం మండల కేంద్రంలో గోల్లవాడ పాఠశాలలో ఉన్నా అంగన్ వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీఎస్ (గొల్లవాడ) హెచ్‌ఎం పెడెం రాజు పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు అంగన్ వాడీ లో పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పిల్లలు పుట్టిన వెంటనే ముర్రు పాలను తాగించాలని అన్నారు. హౌజుబుజుర్గ అంగన్ వాడి లో తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం టిచర్ రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌజుబుజుర్గ కార్యదర్శి అరుణ, టీచర్ దేవమ్మ, వాణీ, ఏఎన్ఎం, ఆయా తనుగుల సరోజన , గర్భిణీ లు తదితరులు పాల్గొన్నారు.

నడికుడ : తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం చర్లపల్లి1,2 అంగన్వాడి కేంద్రలలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ స్వాతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్ఠమైనవనీ, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు అమతంతో సమానమని, ముర్రు పాలు పిల్లలకు మొదటి వ్యాక్సిన్ తో సమానమని, వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రోజా రాణి, హెచ్‌ఎం అచ్చ సుదర్శన్, అంగన్వాడీ టీచర్స్ బీముడు లక్ష్మీ, నందిపాటి సంధ్య, ఆయాలు అరుణ, సుశీల, తల్లులు శనిగర మౌనిక, గంగారం అనుషా, తూర్పాటి భాగ్యలక్ష్మి, గర్భిణీలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు సకాలంలో పరిష్కారం : జిల్లా కలెక్టర్ పీ.ప్రావీణ్య

నవతెలంగాణ-సుబేదారి



ధరణి సమస్యలు సకాలంలో పరిష్కారం ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహసిల్దారులతో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి పటిష్ఠచర్యలు తీసుకుంటామని సీసీఎల్ఏ కమిషనర్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ధరణి ద్వారా మొత్తం 38261 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటి వరకు 19649 దరఖాస్తులను ఆమోదించామని 14187 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, ప్రస్తుతం 5314 ధరణి దరఖాస్తులు వివిధ స్థాయిలో పెండింగ్ లో ఉన్నాయని, వీటిని సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ జిల్లాలో ప్రభుత్వ భూములు, భవనాలు వివరాల పూర్తి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీఓలు, తహసిల్దార్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే 'డబుల్' ఇళ్లు పంపిణీ చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ

అంబేద్కర్, జితేందర్ సింగ్ నగర్ స్థానిక గుడిసెవాసులకి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే ఇవ్వాలని సీపీఎం హన్మకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గాదె ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హన్మకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని శనివారం సాయంత్రం జి.ప్రభాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా జితేందర్ సింగ్, అంబేద్కర్ నగర్ స్థానిక గుడిసెవాసులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. గతంలో వారు నివసిస్తున్న స్థలంలోనే నాటి సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తానని చెప్పి వారి ఇళ్లను ఖాళీ చేయించి 594ఇండ్లు నిర్మించారన్నారు. ఇండ్లు పూర్తయి ఐదారుఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. గుడిసెవాసులు గత 30, 40 ఏళ్లుగా గుడిసెల్లో జీవిస్తున్నారని, వర్ష కాలంలో విషపురుగులతో సహవాసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆగస్టు 15 లోపు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తామన్నారు.


ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ నాయకులు ఎర్ర చంద్రమౌళి, కోయడ కృష్ణ, ఓరుగంటి స్వామి, మందసంపత్, సౌరం రఘు, దరిగ రమేష్, గద్దిపాటి సాయికుమార్, వంగాల రాజశేఖర్, మామిడి సుధాకర్, సరోజన, శిల్ప సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసుల దీక్షకు ఆర్‌పీఐ సంఘీభావం

హనుమకొండ చౌరస్తా : లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు పసుల రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండ తాసిల్దార్ కార్యాలయం ప్రక్కన బాలసముద్రంలో అంబేద్కర్ నగర్ లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్స్ కొరకై అంబేద్కర్ నగర్ , జితేందర్ సింగ్ నగర్, లబ్ధిదారులు గత ము డు రోజులుగా చేపడుతున్న రిలే దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి గుడిసెవాసుల అధ్యక్షులు ఓరుగంటి, స్వామి, ఎర్రచంద్రమౌళిలకు పూల మాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల న్యాయమైన డిమాండ్లను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సరిగోమల స్నేహలత, రవీందర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సార్‌యూ ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలు





- సినీ హస్యనటుడు తనికెళ్లకు పీహెచ్‌డీ ప్రధానం
- డిగ్రీలు తీసుకున్న విద్యార్థులకు అభినందనలు

నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో శనివారం ద్వితీయ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఎనగందుల వరదారెడ్డి అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా సీయెంట్ టెక్నాలజీ ఫౌండర్, చైర్మెన్ బీవీఆర్.మోహన్‌రెడ్డి హాజరుకాగా 750కి పైగా తెలుగు,తమిళ,కన్నడ,హిందీ చిత్రాలలో పనిచేయడమే కాకుండా రంగస్థల నటుడుగాను, కవిగాను, కథా రచయిత గాను దర్శకుడు గాను ప్రముఖ ప్రజ్ఞ శీలి, సినీ హాస్యనటుడు తనికెళ్ల భరణికి ఎస్సార్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. ఈ సందర్భంగా సీయెంట్ టెక్నాలజీస్ ఫౌండర్, చైర్మెన్ డాక్టర్ బీవీఆర్.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్‌ని అభినందిస్తూ విద్యార్థులు, తల్లి తండ్రులు, ఎస్సార్ విశ్వవిద్యాలయం అధ్యాపకుల కృషి వలన ఈ మైలు రాయిని దాటడం సాధ్యమైందన్నారు. ఈ కాలంలో విద్యాసంస్థ, పరిశ్రమల మధ్య అవగాహనా ఎంతో అవసరమన్నారు. వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని, విలువలతో కూడిన సాంకేతికతతో అమెజాన్, ఆపిల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు ముందు వరసలో నిలిచాయన్నారు.

వ్యవస్థాపకునిగా లేదా ఉద్యోగిగా కూడా వ్యవస్థాపకత ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం నూతన ఆవిష్కరణలతో మిస్సైల్ మాన్ అఫ్ ఇండియాగా గుర్తింపు పొందారని తెలిపారు. వ్యవస్థాపకునిగా మారిన తర్వాత తాను ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలని స్థాపించినట్లు వరంగల్, మడికొండలో కూడా తమ కంపెనీ ఉన్నట్లు తెలిపారు. ఏఐ టెక్నాలజీతో సమాచారం, రియల్ టైం డేటా పొందుతున్నామని చాట్ జీపీ టీ ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. క్లౌడ్ కంప్యూ టింగ్‌ద్వారా ముున్ముందు ఎన్నో సేవలు పొందనున్నా మన్నారు.

ఎస్సార్ ఛాన్సలర్ ఎనగందుల వరద రెడ్డి మాట్లాడుతూ ఎస్సార్ విశ్వవిద్యాలయం ద్వితీయ వార్షికోత్సవంలో డిగ్రీలు తీసుకుంటున్న విద్యార్థులకి అభినందనలు తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల 2002 లో స్థాపించి ఎన్నో మైలురాళ్ళని దాటి విశ్వవిద్యాలయం స్థాయికి చేరిందన్నారు. న్యాక్, ఎన్‌బీఏ అక్రిడిటేషన్‌లు, నిర్ఫ్ ర్యాంకింగ్ సాధించిందని ఇది నాణ్యమైన విద్య వలన సాధ్యమయ్యిందన్నారు. ఎస్సార్ వైస్ చాన్సలర్ డాక్టర్ దీఆర్.దీపక్‌గార్గ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకి ఎన్నో మెళకువలతో పాటు నైపుణ్యాలని అందిస్తున్నామన్నారు. తల్లితండ్రుల సహకారంతో ఎస్సార్ విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుందని తెలిపారు. బి.టెక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎల క్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్‌విభాగాలు, స్కూల్ అఫ్ అగ్రికల్చర్, స్కూల్‌అఫ్‌సైన్స్, స్కూల్ బిజినెస్ వివిధ కోర్స్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌ఈపీ మార్గదర్శకాలను పాటిస్తున్నట్లు, 2 వేల పబ్లికేషన్స్, 200పేటెంట్స్ ప్రచురితం అయిన ట్లు, 50 కోట్ల రీసెర్చ్ ఫండింగ్‌లు యూనివర్సిటీలో ఉన్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రముఖ నటుడు, రచయితా తనికెళ్ల భరణి తనికెళ్ళ భరణి మాట్లాడుతూ ఈ జీవితంలో పీహెచ్‌డీ తనకు ఒక మైలు రాయిగా తెలిపారు. ఈ డాక్టరేట్ తన జీవిత భాగస్వామికి అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. జీవితంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఈరోజు పట్టాలు పొందిన విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటే బంగారు భవిష్యత్తు ను పొందుతారని తెలిపారు. విద్యార్థులు తమ తల్లి తండ్రుల కళలను నిజం చేయాలన్నారు. ఆయన తన కవిత్వంతో తన అనుభవాలను ఉదాహరించారు. ఎస్సార్ విశ్వవిద్యాలయం తనకు పీహెచ్‌డీ ప్రధానం చేయడం పట్ల ఎప్పటికీ కృతజ్ఞుడిగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా విభాగాలలో ఉతీర్ణులైన వారికీ ఎం.టెక్, ఎంబీఏ, బి.టెక్, బీబీఏ, బీఎస్సీ (అగ్రి) డిగ్రీలు, పురస్కారాలు అందజేసి పూర్వ విద్యార్థులని సన్మానించారు. కాంక్లేవ్, అధికారిక ఊరేగింపు టాసింగ్ అఫ్ కాప్స్ కార్య క్రమాలు జరిగాయి. సీఎస్‌ఈ విభాగంలో పరిశోధకుడు మోతె రాజేష్, డాక్టర్ ఎం. శశికళ ప్రొఫెసర్ అండ్ హెడ్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తిచేసిన సందర్భంగా డాక్టరేట్ పట్టాని అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు నూతనంగా రూపొందించిన ఎస్సార్‌యూ లోగోను ఆవిష్కరించా రు.

ఈ కార్యక్రమంలో ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎ. మధుకర్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనరెడ్డి, కోర్ కమిటీ మెంబెర్స్, డీన్ ఫాకల్టీ డాక్టర్ వి.మహేష్, డీన్ ఇంచార్జి డాక్టర్ రాందేశముఖ్, డీన్ మేనేజ్‌మెంట్ ఇండస్ట్రీ నిపుణులు డాక్టర్ ఎన్.సుమన్‌కుమార్, వివిధ విభాగాల డీన్‌లు, హెడ్స్, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్ పూర్వ విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

సినీ నటుడు తనికెళ్ల భరణికి ఎస్సార్ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రధానం

ఎస్సార్ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో ప్రముఖ నటుడు, రచయితా తనికెళ్ళ భరణికి ఈ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసారు. సియెంట్ టెక్నాలజీస్ ఫౌండర్, చైర్మెన్ బీవీఆర్.మోహన్‌రెడ్డి, ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్సలర్ ఎనగందుల వరదారెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా తనికెళ్ళ భరణి సినిమా రంగానికి, సాహిత్య రంగానికి చేసిన సేవలకు గాను ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వారు తెలిపారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే రేవూరి

నవతెలంగాణ-ఆత్మకూరు



పరకాల నియోజకవర్గం లోని ఆత్మకూరు, దామెర మండలాల లోని వివిధ గ్రామాలకు చెందిన 66 మంది లబ్ధిదారులకు రూ.27,32,300 వేల రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను , ఏడుగురు లబ్ధి దారులకు రూ .7 లక్ష 812 రూపాయల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులను శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులు , స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతూ అనారోగ్యాల బారిన పడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించటం ద్వారా ప్రభుత్వం భరోసాగా నిలుస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా మంజూరు చేసి అందించిన సీఎం రేవంత్ రెడ్డి కి లబ్ధిదారుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, సొసైటి చైర్మన్ ఏరుకొండ రవిందర్, మాజీ ఎంపీపీలు సునందా సుధాకర్ రెడ్డి, మార్క సుమలత రజనీకర్, మాజీ జెడ్పిటిసి కక్కెర్ల రాధిక రాజు, మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మాజీ ఎంపిటిసి లు అర్షం వరుణ్ గాంధీ, సర్పంచ్‌లు పర్వతగిరి రాజు, కంచె రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ లు పరికరాల వాసు, బరుపట్ల కిరీటి, ఎండి ఖాజా, జైపాల్‌రెడ్డి, అలువాల రవి, తనుగుల సందిప్, బాబుమీయ, ఎంపిడిఓ శ్రీనివాస్ రెడ్డి, ఖాసిం, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పొన్నం పరామర్శ

నవతెలంగాణ-ఎల్కతుర్తి



మండలం లోని కోతులనడుమ గ్రామానికి చెందిన ఎర్రోల్ల చంటి ఎన్ఐటి పిహెచ్‌డి స్టూడెంట్ తీవ్ర జ్వరంతో ఇటీవల అకాల మరణం చెందగా ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. ఎర్రోళ్ల చంటి కుటుంబ సమస్యలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు నేనున్నానంటూ వారికీ ధైర్యం చెప్పాడు. అతని రెండవ పాప కూడా బ్రెయిన్ కు సంబంధించిన అనారోగ్యరాతో ఉండటం, తీవ్రమైన ఆర్థిక సమస్యలతో నలిగిపోతున్న వారి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మండల కేంద్రం చెందిన గోడిశాల యాదగిరి తల్లి మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని సైతం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు సుఖిని సంతాజీ, మండల నాయకులు గోలి రాజేశ్వరరావు, బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, ఎర్రోళ్ల చైతన్యయూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల జెగన్, బాబురావు,అంబాల శ్రీకాంత్ ఎర్రోళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధక వర్గానికి పీహెచ్‌డీ విద్యార్థుల నాణ్యత ముఖ్యం

- వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



ఎన్ఐటి వరంగల్‌లోని అధ్యాపకుల కోసం శనివారం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ లో ఎఫెక్టివ్ పీహెచ్‌డీ పర్యవేక్షణపై మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ వీఆర్‌కె.రాజు సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ వెంకయ్యచౌదరి సమన్వయం చేయగా ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు ఐఐటీ ఖరగ్‌పూర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పార్థప్రతిమ్ చక్రబర్తి, ఐఐఎస్ఈఆర్ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభోత్సవం సందర్భంగా, ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ పరిశోధక వర్గానికి పీహెచ్‌డీ విద్యార్థుల నాణ్యత చాలా ముఖ్యమైనదన్నారు. ఈ వర్క్‌షాప్ కొంతమంది సీనియర్ పరిశోధకులు సమర్థవంతమైన పీహెచ్డీ మార్గదర్శకత్వం కోసం వారి అనుభవాలను పంచుకునేందుకు వీలు కల్పిస్తుం దన్నారు. వర్క్‌షాప్ నుండి ఎన్ఐటి వరంగల్ ఫ్యాకల్టీకి ప్రయోజనం ఖచ్చి తంగా కలుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ పార్థ ప్రతిమ్ చక్రబర్తి పీహెచ్‌డీ పర్యవేక్షణ గురించి తన అనుభవాలను పంచుకున్నారు. నాణ్యమైన పరిశోధనలను తయారు చేయడం పీహెచ్‌డీలకు మార్గదర్శకత్వం చేయడం ప్రాముఖ్యత గురించి ఆయన నొక్కి చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ సంతను భట్టాచార్య తన అనుభవాలను పంచుకుంటూ నాణ్యమైన రీసెర్చ్ స్కాలర్‌లను తయారుచేయడంపై మాట్లాడారు.

గంజాయి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జిల్లా ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్

నవతెలంగాణ-సుబేదారి



గంజాయి రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని జిల్లా ఎక్సైజ్ అధికారి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గంజాయికి వ్యతిరేకంగా రూపొందించిన డోర్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. నవసమాజ నిర్మాణం కోసం జరిగే పోరాటంలో యువత భాగస్వామ్యం కావాలని చెడు వ్యసనాలకు లోనై జీవితాలను కోల్పోవద్దని, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని వృథా చేసుకోవద్దని, గంజాయి డ్రగ్స్‌కు అలవాటు పడితే సర్వస్వం కోల్పోతారని, చిన్న వయసులోనే మాదక ద్రవ్యాలకు అలవాటు పడి, మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని, బాగా చదివి జీవితంలో ఏదైనా ఉన్నత స్థాయిలో ఉంటే తల్లిదండ్రులు వారి మీద పెట్టుకున్న ఆసలు నెరవేర్చడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డీ.తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు మాటూరు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గణితంలో కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



గణిత స్కూల్ కాంప్లెక్స్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, గణితంలో కనీస అభ్యాసన సామర్థ్యాలు సాధించాలని అన్నారు. శనివారంహనంకొండ పబ్లిక్ గార్డెన్ ఎదురుగా పెట్రోల్ పంపులో హెచ్‌ఎం దేవమణి అధ్యక్షతన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నేషనల్ అచీవ్ మెంట్ సర్వే-2024కు సంసిద్ధమగుటకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంకు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్, హనుమకొండ జిల్లా సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి నేషనల్ అచీవ్ మెంట్ సర్వే 2024 లో మన జిల్లా సముచితస్థానంలో ఉండుటకు పలు సూచనలు చేశారు. అభ్యసన సామర్థ్యాలను, పిల్లల స్థాయిలను దష్టిలో పెట్టుకొని బోధించాలని, వివిధ మాదిరి ప్రశ్నా పత్రాలు ద్వారా పిల్లలకు తర్ఫీదు నివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర బాధ్యులు కందగట్ల సురేష్, కంది శ్రీనివాస్ రెడ్డి, టీఎంఎఫ్ జిల్లా బాధ్యులు బోయిని మహేష్, రిసోర్స్ పర్సన్ లు తౌటం భాస్కర్, పాశం రాజిరెడ్డి హన్మకొండ, హసన్ పర్తి, ఐనవోలు మండలాల గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-శాయంపేట

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీలో రుణమాఫీ పొందిన రైతులు మరల పంట రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పిఏసిఎస్ చైర్మన్ కుసుమ శరత్, సీఈవో రాజమోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటరుణం కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, 1బీ పహాని జిరాక్స్, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, ఈసీ కాపీలతో పిఏసిఎస్ కార్యాలయంలో సంప్రదించాలని వారు తెలిపారు.

పచ్చదనం స్వచ్ఛతనంపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-శాయంపేట



మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవో ఫణిచంద్ర అధ్యక్షతన పచ్చదనం, స్వచ్ఛతనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్చార్జి డిడబ్ల్యూఓ, పరకాల సిడిపిఓ భాగ్యలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుండి 9 వరకు ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్చార్జి డిడబ్ల్యూఓకు సన్మానం

పరకాల సిడిపిఓ భాగ్యలక్ష్మి హనుమకొండ జిల్లా ఇంచార్జ్ డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ గా నియామకం కావడంతో శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు రత్నమాల, జ్యోత్స్న, కవిత, శ్వేత, అరుణ, పుష్ప, రమ శాలువాతో సత్కరించారు.

మండలంలో మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శలు

నవతెలంగాణ-దామెర



మండలంలోని దుర్గంపేట, దామెర గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పత్తి గంగారాములు, వర్కుటి చేరాలు కుటుంబాలను శనివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులు అర్పించారు. దామెర గ్రామంలో గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రిపోర్టర్ హింగే అరవిందును పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గండు రామకష్ణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ జాకీర్ అలీ, మాజీ ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం ఆగస్టు 04, 2024 www.navatelangana.com

మ్యూచువల్ బదిలీలు పొందిన ఉపాధ్యాయుల సర్వీస్‌ను పరిరక్షించాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతి

నవతెలంగాణ - భూపాలపల్లి టౌన్



జీవో 317లో భాగంగా వచ్చిన పరస్పర బదిలీలు పొందిన ఉపాధ్యాయుల సర్వీస్‌ను పరిరక్షించాలని పరస్పర బదిలీలు పొందిన ఉపాధ్యాయుల బాధితులు అన్నారు. శనివారం జిల్లా కేం ద్రంలో కలెక్టర్ కార్యాలయంలో 317 అప్పీలు కమిటీ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరస్పర బదిలీలు పొందిన బాధితులు మాట్లాడుతూ పరస్పర బదిలీ పొందిన ఉపాధ్యాయులను జీవో 317 బాధితులుగా గుర్తించి పరస్పర బదిలీని పరిపాలనాపరమైన కారణంగా చేసినదిగా పరిగణించి, కొత్త జిల్లాలకు పున:కేటాయింపుగా పరిగణించి బాధిత ఉపాధ్యాయుల ఉద్యోగుల సర్వీసును పరిరక్షించవలసిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని, 317 అప్పీల్ కమిటీ మంత్రులను, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శికి, విద్యా శాఖ డైరెక్టర్ కు పరస్పర బదిలీల బాధిత ఉపాధ్యాయుల సంఘ పక్షాన విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో కందుకూరి దేవదాసు, కదార్ల కృష్ణ ప్రసాద్, నక్క తిరుపతి, పసుల నర్సయ్య, జి.శ్రీనివాస్, అర్జున్, సుధాకర్, సదానందం, శ్రీధర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు

తమకు న్యాయం చేయాలి

మంత్రులకు వినతి

హైవేలో భూములు కోల్పోతున్న బాధిత రైతులు

నవతెలంగాణ-చిట్యాల:



భూపాలపల్లి నియోజకవర్గ పర్యటన నిమిత్తం వచ్చిన మంత్రులను గణపురంలో కలిసిన భూభాధిత రైతులు మండలంలోని నవాబుపేట గ్రామం గుండా పోతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూమి కోల్పోతున్న రైతులు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్కలను కలిసి తమ భూమి గ్రీన్ ఫీల్డ్ హైవేలో కోల్పోతున్నామని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ తమ భూమి గ్రీన్ ఫీల్డ్ హైవేలో పోవడం వల్ల నిరాశ్రయులమవుతున్నామని, ఉపాధి ప్రశ్నార్థకమయిందని, తమకు న్యాయం జరగాలంటే ఒక ఎకరా భూమికి రూ.కోటి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వినతి పత్రం అందజేసినట్లు రైతులు కొసిరెడ్డి రత్నాకర్‌రెడ్డి, బిల్ల సత్యనారాయణరెడ్డి, భీముడి అమరేందర్, రాంచందర్, చెక్క నర్సయ్య, నేరెళ్ల సమ్మయ్య లు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రులు రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సహకార సంఘం రైతులకు రుణమాఫీ చేయాలి

మంత్రులకు వినతిపత్రం అందజేసిన చైర్మన్ కుమార్‌యాదవ్

నవతెలంగాణ-గణపురం



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు రుణమాఫీ వర్తింప చేయాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, శ్రీధర్‌బాబు లకు సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్‌యాదవ్ శనివారం వినతి పత్రం అందించారు. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా దాదాపు 2919 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు బ్యాంక్ అధికారులు రెన్యూవల్ చేయకపోవడమే దీనికి కారణమన్నారు. మంత్రులు స్పందించి సొసైటీలో ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుత ఋణమాఫీ పథక నియమావళి ప్రకారం సంఘ రైతులు(2919) రైతులకు రూ. 8,85,19,752 కోట్ల నష్టపోతున్నారన్నారు. నియమాలను సడలించి సంఘ రైతులకు లబ్ధి చేకూరే విధంగా చూడాలన్నారు.

కేటీపీపీ లో ల్యాండ్ అయిన మంత్రుల హెలికాప్టర్

నవతెలంగాణ-గణపరం

గాంధీనగర్ ఇండస్ట్రియల్ పార్క్ ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రుల హెలికాప్టర్ శనివారం కాకతీయ థర్మల్ విద్యుత్తు కేంద్రం హెలిపాడ్ లో ల్యాండ్ అయింది. అక్కడి నుండి ముగ్గురు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దిద్దుళ్ల శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, భూపాలపల్లి, వర్ధన్నపేట శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే. ప్రత్యేక వాహనంలో గాంధీనగర్ గుట్ట పైకి చేరుకున్నారు ముందుగా మన మహోత్సవంలో భాగంగా ఒక్కొక్కరు చెట్లను నాటారు. అనంతరం ఇండస్ట్రియల్ పార్క్ సమీపంలో ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు .

మంత్రులకు గజమాలతో సన్మానం..



గా ం ధీ, న గ ర్ ఇండస్ట్రియల్ పార్క్‌నకు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దిద్దుళ్ల శ్రీధర్ బాబు, దనసరి అనసూయ సీతక్క, వరంగల్ పార్లమెంట్ సభ్యులు కడియం కావ్య, భూపాలపల్లి, వర్ధన్నపేట శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, కే ఆర్ నాగరాజులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల బరిలో జిల్లెల్ల ఓదెలు యాదవ్

నవతెలంగాణ-మల్హర్ రావు/కాటారం

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కాటారం మండలంలోని గంగారం గ్రామానికి చెందిన జిల్లెల్ల ఓదెలు యాదవ్ కాటారం మండల అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నట్లుగా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా మాట్లాడారు. ఈనెల 5 నుండి సెప్టెంబర్ 5 వరకు ఆన్‌లైన్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్నవి. ఈ సందర్భంగా ఓదెలు యాదవ్ మాట్లాడుతూ మండల అధ్యక్షులుగా ఆశీర్వదించి గెలిపించినట్లయితే అందరికీ అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఎన్నుకోబడే ఈ అధ్యక్ష పోటీల్లో కార్యకర్తలు అందరూ తనకు మద్దతుగా యువకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రోత్సహించాలని, ఆన్‌లైన్ ద్వారా తనకు ఓటు వేయించి అత్యధిక మెజార్టీతో వచ్చేలా చూడాలని కోరారు.

నేడు ధన్వాడలో యూత్ కాంగ్రెస్ సమావేశం

నవతెలంగాణ-మల్హర్‌రావు./కాటారం/మహదేవ్‌పూర్

ఈనెల 4న(నేడు ఆదివారం) కాటారం మండలంలోని ధన్వాడ గ్రామంలోని రాష్ట్ర ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వగృహంలో ఆదివారం మధ్యాహ్నం12:30 లకు మంథని నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల ముఖ్య సమావేశం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికారప్రతినిధి. ఎర్రవెల్లి విలాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు రానున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా మంథని నియోజకవర్గ స్థాయి, యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీపాద ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుద్దిళ్ళ శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లుగా తెలిపారు. కావున ఈకార్యక్రమానికి మంథని నియోజకవర్గంలోని యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌లను ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రులు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్లను రాష్ట్ర మంత్రులు ఆవిష్కరించారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ను రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖా మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క, టిజి ఐఎసెస్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, ఎస్పి కిరణ్ ఖరే లతో కలసి ఆవిష్కనించారు. సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నివేషన్ కార్యక్రమాన్ని చేపట్టి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు వారి నైపుణ్యాలను ప్రదర్శనకు ఇదొక చక్కటి అవకాశమన్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా కో-ఆర్డినేటర్ జాడి నరేందర్ 9440411878 కు కాల్ చేయాలని ఆయన సూచించారు.

అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలి..



సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రులు శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కలు తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలు, అందరి సహకారంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. గడిచిన ఏడు నెలల్లో ఎన్నో విప్లవాత్మకమైనటువంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసినట్లు మంత్రులు పేర్కొన్నారు. గత ప్రభుత్వ 10 సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో, అన్ని రకాలుగా దివాలా చేసిందని, స్వార్థం కోసం పరిపాలనను విచ్ఛిన్నం చేశారన్నారు. పేదవాడు కోరుకునే విధంగా పరిపాలన అందించడంపై ఈ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, తమ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వమని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేదని, ఈప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒకటో తారీఖున వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. రూ.ఏడు లక్షల కోట్లు అప్పు ఉన్నప్పటికీ ప్రభుత్వ సిబ్బందికి ఒకటే తేదీన వేతనాలు ఇస్తున్నామని, పేదలకు మంచి చేయాలని, పేదల కోరికలు తీర్చేందుకు మీ వంతు సహాయ సహకారాలు కావాలని మంత్రులు పేర్కొన్నారు. గడిచిన ఏడు నెలలు అనేక రంగాల్లో మార్పులు తీసుకొచ్చామని సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గం మొత్తం రోజుకు 16 గంటలు పని చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రజలు మన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చుటలో ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత ఎంతో కీలకమని, ప్రజల కనీస అవసరాలు, మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రులు పేర్కొన్నారు. ధరణి ద్వారా ప్రజలు ఎన్నో ఇబ్బందులు, బాధలు, కష్టాలు ఎదుర్కొన్నారని వాటన్నింటిని పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపట్టినట్లు మంత్రులు పేర్కొన్నారు. చెప్పిన ప్రతి పనిని నెరవేస్తున్నామని మంత్రులు తెలిపారు. భూమి విషయంలో న్యాయ సమస్యలు లేకుండా మంచి చేసే దాంట్లో ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పుకోవద్దని రెవెన్యూ అధికారులకు సూచించారు. విద్యా, వైద్య, వ్యవసాయం పట్ల ప్రభుత్వం ఎంతో నిబద్ధత ఉందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నేతృత్వంలో 31 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని, భారతదేశంలో ఏ రాష్ట్రం చేయనటువంటి చారిత్రక ఘట్టాన్ని ప్రభుత్వం చేసి చూపించిందని మంత్రులు పేర్కొన్నారు. రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఎంతో ఆశయంతో ఉందని అన్ని ఇబ్బందులు అధిగమించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు రుణ మాఫీ చేశామని, రాబోవు రోజుల్లో రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని మంత్రులు పేర్కొన్నారు. పేదలకు మంచి చేయడం, యదార్థాలు గమనించి ప్రభుత్వ ఉద్యోగులు పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రులు పేర్కొన్నారు. గతంలో పోడు భూముల వ్యవసాయం చేసుకున్న రైతులను ఇబ్బందులకు పెట్టకుండా గతంలో లాగా అటవీ, రెవిన్యూ, పోలీస్ కక్ష పూర్వకంగా వ్యవహరించకుండా స్నేహపూర్వకంగా వ్యవహరించాలని మంత్రులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా ప్రభుత్వ అధికారులు పేదలకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు, టిజిఐఎస్ఎస్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన నాణ్యమైన వైద్య సేవలందించాలి

వైద్యాధికారుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క


నవతెలంగాణ-భూపాలపల్లి





ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలందించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రూ.3 కోట్ల 60 లక్షలతో నిర్మించిన ఔషధాలు భద్రపరచు గోదాం, రూ.27 లక్షలతో నిర్మించిన వైద్యాధికారుల క్యాంటీన్‌ను పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావుతో కలిసి ప్రారంభించారు.అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రోగనిర్ధారణకు సిటీ స్కాన్ ఎంఆర్ఐ, ప్రొఫెసర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణంలో నీళ్లు నిలువ లేకుండా ఆధునీకరణ చేసి మొక్కలు పెంచి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. వైద్య సేవలు కొరకు వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు వెళ్లకుండా ఇక్కడే పూర్తిస్థాయిలో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. ములుగు, మంథని ప్రాంత ప్రజలు వైద్య సేవలకు వస్తుంటారని కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సిబ్బంది ఖాళీల వివరాల నివేదిక అందజేయాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాలన్నారు. మహిళల వైద్య సేవలకు ప్రసూతి వైద్యులు నియమాకానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిరుపేదలకు ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నదని మంత్రులు తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు అవసరమైన నిధులను తక్షణమే డిఎంఎఫ్‌టీ నిధులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రిలో పరిశుభ్రత లోపించిందని ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్, ఇతర అధికారులు నిరంతరం ఆసుపత్రులను తనిఖీ చేస్తూ వైద్య సేవలను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలు నిరుపేదలు అధికంగా నివసించే మన జిల్లాలో వైద్య సేవల్లో ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు రావొద్దని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజలు ఎప్పుడూ మన సేవలను గుర్తుంచుకుంటారని, ఇటీవల చేపట్టిన బదిలీలలో కొందరు టీచర్లు బదిలీ అయి వెళ్లిపోతుంటే విద్యార్థులు బాధపడటం గమనించామని, అదే రీతిలో వైద్య సిబ్బంది కూడా పనిచేసి ప్రజల మనలను పొందాలని సూచించారు. వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని, ప్రజలు మీ సేవలను ఎప్పుడు గుర్తుంచుకుంటారని, వారు మద్దతు, ఆశీర్వాదం మీకు ఉంటుందని తెలిపారు. వృత్తికి అర్థం, పరమార్థం తేవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిజిఐఎస్ఎస్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, పర్యవేక్షకులు డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో మంత్రుల పర్యటన సక్సెస్..



ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్ల పర్యటనతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
మైలారం ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపన సభకు భారీగా తరలివచ్చిన జనం..
భూపాలపల్లి యువతకు ఇండస్ట్రీస్ తో భారీగా ఉద్యోగావకాశాలు..
తెలంగాణలో ప్రజలందరి దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది..
ప్రజలకు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేస్తాం..

నవతెలంగాణ -గణపురం

భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య, టిజిఐఐసి రాష్ట్ర చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి ఇతర ముఖ్య నేతల పర్యటన సక్సెస్ అయింది. భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపుర మండలం మైలారం గ్రామ శివార్లలో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా మంత్రులు పాల్గొన్నారు. ముందుగా చెల్పూర్ జెన్కో క్వార్టర్స్ లోని హెలీ ప్యాడ్ వద్ద ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ మంత్రులకు శాలువాలు కప్పి, బొకేలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం మైలారం గ్రామ శివారులోని గుట్టలకు చేరుకుని అక్కడ ఏర్పాటుచేసిన ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు తో పాటు ఇతర మంత్రులు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభ వద్ద మంత్రులు మాట్లాడుతూ భూపాలపల్లి యువతకు ఇక్కడ ఏర్పాటు కాబోయే ఇండస్ట్రియల్ పార్కుతో చాలామంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. యువతకు స్కిల్ ఇండియా ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలను చూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం యువతకు జాబ్ క్యాలెండర్ను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలందరి దీవెనలతో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలన్నింటినీ తప్పక అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి, ములుగు నియోజకవర్గాలకు సాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలోనే ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి డిపిఆర్ తయారు చేస్తామన్నారు. అనంతరం భూపాలపల్లి పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డ్రగ్స్ స్టోరేజ్ రూమును, డాక్టర్స్ క్యాంటీన్‌ను మంత్రులు ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రులకు భారీ గజమాలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి కలెక్టరేట్ లోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి అధికారులు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మంత్రులు అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ లోని మంత్రుల చాంబర్ లో లంచ్ చేసి చెల్పూర్ జెన్కో క్వార్టర్స్ లోని హెలీ ప్యాడ్ కు చేరుకుని అక్కడి నుండి హైదరాబాద్ కు మంత్రులు తిరుగు ప్రయాణమయ్యారు. కాగా, మంత్రులకు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు దగ్గర ఉండి సెండ్ ఆఫ్ ఇచ్చారు. మంత్రుల పర్యటన విజయవంతం అవ్వడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజాప్రతినిధులకు, అన్ని శాఖల అధికారులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి..

మృతదేహంతో రోడ్డుపై భూపాలపల్లి-పరకాల రహదారిపై ధర్నా

నవతెలంగాణ-రేగొండ



విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రూపి రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంచగిరి రమేష్ (36)తన వ్యవసాయ భూమి వద్దకు వ్యవసాయ పనుల నిమిత్తం ఇనుప గొర్రు భుజంపై పెట్టుకుని సమ్మయకుంట సమీపంలో వెళుతుండగా విద్యుత్తు వైర్లు కిందికి వేలాడడంతో ఇనుప గొర్రు విద్యుత్ వైర్లకు తాకి అక్కడికక్కడే మృతి చెందాడని ఆరోపించారు. గమనించిన చుట్టుపక్కల రైతులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకునే వరకే రమేష్ అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కాగా విద్యుత్ అధికారులకు గతంలో ఎన్ని సార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే కిందికి వేలాడిన విద్యుత్ వైర్లు గొర్రుకు తాకడంతో రమేష్ మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు గ్రామస్తులు రమేష్ మృతదేహంతో భూపాలపల్లి, పరకాల ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు. దీంతో కొంతసేపు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చిట్యాల సిఐ మల్లేష్ యాదవ్, రేగొండ ఎస్సై రవికుమార్ పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి విజన్‌రావు చేరుకొని మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రభుత్వం నుండి సహకారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. మృతునికి భార్య కవిత ఇద్దరు కుమారులు ఉన్నారు. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ప్రశాంతంగా ముగిసిన మావోయిస్టుల వారోత్సవాలు ఊపిరి పీల్చుకున్న

ప్రశాంతంగా ముగిసిన మావోయిస్ట్ వారోత్సవాలు

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

రాష్ట్రంలో మావోయిస్టు పార్టీ మావోయిస్టు వారోత్సవాలు జరుపుకోవాలని జులై 28 నుండి ఆగస్టు 3 వరకుపిలుపునివ్వడంతో తెలంగాణ పోలీసులు ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ ఆధ్వర్యంలో మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటన జరగకుండా డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాదేవపూర్ సీఐ రామచంద్రరావు మహాదేవపూర్, కాళేశ్వరం పలిమెల ఎస్సైలు కె.పవన్ కుమార్, చక్రపాణి థామస్ రెడ్డిలు ప్రతిరోజు తనిఖీలు చేపట్టడంతో పాటు కమ్యూనిటీ ప్రోగ్రాములు చేస్తూ మారుమూల గిరిజన గుత్తి కోయగూడెంలో పర్యటించి మావోయిస్టులకు సహకరించవద్దని ఆదేశించారు.ఇటు కాళేశ్వరం అంతరాష్ట్ర బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టి అనుమానితులను ప్రశ్నించి వదిలిపెట్టారు. అటు మేడిగడ్డ బ్యారేజీ వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అదేవిధంగా మావోయిస్టులు కూడా ఎలాంటి సంఘటనలకు పాల్పడకపోవడంతో మొత్తం మీద మావోయిస్టు వారోత్సవాలు ప్రశాంతంగా జరగడంతో ఇటు పోలీసులు అటు ప్రజాప్రతినిధులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్
సీఐటీయూ ఆధ్వర్యంలో వినితిపత్రం అందజేత

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్



విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. శనివారం వరంగల్‌లో విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి టీజీ ఎన్పీడీసీఎల్ సి అండ్ ఎండిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ అన్ని క్యాడర్ లలో పదోన్నతి కల్పించిన తర్వాత బదిలీలు చేయాలని ఫేస్-టూ కార్మికులైన బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్లు ఎస్పీఎం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, అన్ మ్యాన్ ఆర్టిజన్స్‌గా గుర్తించాలని, విద్యుత్ కార్మికులకు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఅండ్ ఎండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నలువాల స్వామి, కంపెనీ అధ్యక్షులు జి.ఆంజనేయులు, కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మెట్టూరి కోటి, వరంగల్ జిల్లా కార్యదర్శి లాడె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించి ఉచిత బస్ పాస్‌లు ఇవ్వాలి: ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు వచ్చే విద్యార్థులకు సకాలంలో బస్ సౌకర్యం కల్పించాలని శనివారం ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూపాలపల్లి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం నుంచి మహాదేవ్‌పూర్‌కు వచ్చే విద్యార్థులకు బస్సు టైం కు వచ్చే విధంగా చూడాలన్నారు అదేవిధంగా కాళేశ్వరం, మహదేవ్‌పూర్ మధ్యలో ఉన్నటువంటి కుదురుపల్లి, ఎడపల్లి గ్రామంలో నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు ఆపడం లేదని, అదేవిధంగా సర్వాయిపేట నుంచి మహాదేవపూర్ బస్సు సౌకర్యం కల్పించాలని అని వారు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా సకాలంలో బస్సులు నడిపించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, హాస్టల్ కమిటీ సభ్యులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పథకం లక్ష్యాల సాధనకు యాక్షన్‌ప్లాన్

- కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

మహిళా శక్తి పథకం లక్ష్యాలను సాధించని వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మహిళా శక్తి పథకం లక్ష్యాల సాధన పై అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మొగులప్పతో కలిసి ఏపీఎంలు, డిపిఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శక్తి పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకుని, జీవన ఆర్థిక ప్రగతి పెంచుకునేందుకు విస్తత ప్రచారం కల్పించాలని అవగాహన పరచాలన్నారు. మహిళాశక్తి పథకం వినియోగించుకున్న లబ్ధిదారుల పేర్లు, యూనిట్ పేరు, ధరలను ప్రతి గ్రామపంచాయతీలో ప్రదర్శింప చేయాలన్నారు. కుట్టుశిక్షణ కేంద్రం ప్రతిఒక్కరికి తెలిసేలా భవనంపై పెయింటింగ్‌తో రా యించాలన్నారు. మహిళాశక్తి పథకం పొందిన లబ్ధిదారుల యూనిట్లపై లబ్ధిదారుని పేరుతోపాటు పథకం పేరు, సంస్థ పేరు, యూనిటీ ధర రాయించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగమైనా, నిర్ణీత సమయంలో లక్ష్యాలు సాధించక పోయినా వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

మహిళా శక్తి పథకం కింద లబ్ధిదారులు పొందే యూనిట్లను వివరించి యూనిట్ల స్థాపనకు ప్రోత్సహించాలి అన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో ఏపీడీ శ్రీనివాస్, డిపిఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే కులగణన చేపట్టాలి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



కేంద్ర ప్రభుత్వం కుల గణన అంశాన్ని చేసే విధంగా కులాలు లేని వారే కోరుకుంటారన్న అంశానికి నిరసనగా బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జనగామ జిల్లా అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్ రాష్ట్ర నాయకులు చిర్ర వీరస్వామిఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ రిజ్వానా భాష షేక్ కు వినతిపత్రం అందజేశారు. తక్షణమే పులకనుల షెడ్యూలు ప్రకటించాలని ఇచ్చిన హామీ మేరకు 42 బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహించాలని దీనిపై బిజెపి రాష్ట్ర పార్టీ తమ వైఖరి తెలియజేయాలని డిమాండ్ చేశారు 42 శాతం రిజర్వేషన్లు అన్నిరంగాల్లో అమలు షెడ్యూల్ తొమ్మిదిలో పెట్టిన పార్లమెంట్‌లో ఆమోదింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా బీసీ నాయకులు గుర్రాల సురేష్ ముదిరాజ్ మారబోయిన శ్రీనివాస్ యాదవ్ భాస్కర్ సిహెచ్ నగేష్ ట్రాన్సఫర్ పాల్గొన్నారు.

ప్రతీ చెరువును గోదావరి జలాలతో నింపుతాం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

నవతెలంగాణ-లింగాలగణపురం



దేశంలో ఏ రాష్ట్రం చేయలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజును చేయాలనే లక్ష్యంతో రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని ఈ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 33మంది లబ్ధిదారులకు రూ.10.88 లక్షల విలువ చెక్కు లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెరువును గోదావరి జలాలతో నింపుతామని భరోసా ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్టు పనుల కొరకు రూ. 160 కోట్లతో సీఎంకి నివేదిక పంపించామని ప్రతి గ్రామంలోని చె రువును గోదావరి జలాలతో నింపుతామని హామీ ఇచ్చారు. భారతదేశం ఏ రాష్ట్రంలో ఇప్పటి వరకు రుణమాఫీ చేయలేదు. తొమ్మిది ఏళ్ళ పాలన కూడా రుణమాఫీ చేయలేదని తెలంగాణ రాష్ట్రంలో రైతుకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే మొదటిదన్నారు. వన మహోన్నత కార్యక్రమంలో మొక్కలునాటారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి లు గణపతి, స్వరూప రాణి, కృష్ణ, విజయమనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్, మాజీ జడ్పీటీసీలు గుడి వంశీధర్ రెడ్డి, శంకరయ్య, జిల్లా నాయకులు దీలిప్ రెడ్డి, మల్లారెడ్డి, ఉపేందర్, రమేష్, నాగేందర్, రాజు, వీరయ్య, అనిల్, సంపత్, నాగరాజు, బాలరాజు, ఆంజనేయులు, కష్ణ రెడ్డి, మూర్తి, ఎంపిడివో జలేందర్ రెడ్డి, తహశీల్దార్ వినయలత, ఎంపిఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-లింగాలఘనపురం

మొక్కలను నాటడం తోపాటు సంరక్షించే బాధ్యత అందరి పై ఉందని ఎంపిఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం మండలం లోని మాణిక్యాపురం గ్రామంలో సాయిరాం యూత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డుకు ఇరువైపులా 50 కొబ్బరి చెట్లు నాటడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెట్లు పెంచడంతో వాతావరణంలో మార్పులు సమతుల్యత ఏర్పడి వర్షాలు కురుస్తున్నాయి. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచి విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సిసి శ్రీకాంత్ రెడ్డి, యూత్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

నవతెలంగాణ-నర్మెట్ట

తహసీల్దార్ కార్యాలయములో సోమవారం జరగబోయే ప్రజావాణినీ మండల ప్రజలు ఉపయోగించుకోవాలని నర్మెట్ట తాసిల్దార్ మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో మండలంలోని తాసిల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహింబడుతుందని ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వొచ్చని ప్రజలు ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు.

బస్సు కొనసాగించాలని డీఎంకు వినతి

నవతెలంగాణ-బచ్చన్నపేట



గత నాలుగేళ్లుగా రాకపోకలు నిలిచిపోయిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నుండి బచ్చన్నపేటకు వచ్చే బస్సును తిరిగి పునరుద్ధించాలని కాంగ్రెస్ మండల యువ నాయకులు పోచంపల్లి నాగరాజు, అఖిల్ మాల, పొన్నం శ్రీకాంత్‌లు కలిసి గజ్వేల్ ప్రజ్ఞపూర్ బస్‌డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా మన్సాన్ పల్లి లింగంపల్లి పడమటి కేశ్వాపూర్ కొన్నే గ్రామాల, మన్సాన్పల్లి నుండి గజ్వేల్ కు వెళ్ళే విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. డిపో మేనేజర్ వెంటనే స్పందించి బస్సులు నడిపేలా చూడాలని అన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి : కడియం

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్



ఆర్థిక స్థోమత లేక అనారోగ్యాలకు గురైన పేదలకు సీఎం సహాయ నిధి పథకం అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథ పల్లి మండలంలో 57 మందికి లబ్దిదారులకు రూ.17లక్షల 57వేల 5వందల విలువైన చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సీఎం సహాయనిధితో కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా పొంది తమ అనారోగ్యాలను దూరం చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లానాయకులు మారుజోడు రాంబాబు, మాజీ జడ్పీటిసి బొల్లం అజయ్, మాజీ ఎంపిటిసి పెర్నే ఉషా, రవి మండల అధ్యక్షుడు కోళ్ల రవి, మహేందర్, బిర్రు మధు, దుబ్బాక నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరిహారం చెల్లించాలని ఆందోళన

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్



విద్యుత్ తీగలు తగిలి గాయాల పాలైన వ్యక్తికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ డివిజన్ కేంద్రంలో సబ్ స్టేషన్ ఆవరణలో బాధిత కుటుంబ సభ్యులు, తండావాసులు బాధితుడితో కలిసి శనివారం ధర్నా చేపట్టారు. మండలంలోని జిట్టేగూడెం పంచాయితీ నారాయణలొద్ది తండాకు చెందిన బానోత్ గంగు తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్ళే క్రమంలో విద్యుత్తు ప్రమాదానికి గురయ్యాడు. సంబధిత విద్యుత్తు అధికారుల నిర్లక్ష్య కారణంగానే ప్రమాదం వాటిల్లిందని అన్నారు. చికిత్స కోసం ఆర్థిక స్తోమత లేని పేద కుటుంబమని అధికారులు పరిహారం చెల్లించాలని లేని పక్షంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంల బానోత్ రవీందర్, బాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించాలి : సీఐటీయూ



నవతెలంగాణ-జనగామ

పశువులకు వైద్యం చేస్తూ పశుసంవర్ధక శాఖకు మధ్య వారిధిగా పనిచేస్తున్న పశుపోషకులను వర్కర్లుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి చుంచు విజయేందర్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ గ్రౌండ్‌లో పసుమిత్రల సమావేశం మంగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విజేందర్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయరంగం అత్యంత కీలకమైనదన్నారు. అందులో పాడిపరిశ్రమ కీలకమన్నారు. పాడి పరిశ్రమ బాగోగులు చూసే పశుమిత్రల పరిస్థితి అత్యంతదయనీయంగా ఉందన్నారు. ఈ తరుణంలో పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే వారికి కనీస వేతనం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లో చురుకుగా ఉన్న సభ్యురాలిని ఎంపిక చేసి ట్రెనింగ్ ఇచ్చి పశుమిత్రగా జిల్లా వ్యాప్తంగా సుమారు 50 మందిని నియమించారన్నారన్నారు. ఈ సిబ్బంది అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన బడుగు బలహీన తరగతుల మహిళలు. పశుమిత్రలు పశుపోషకులకు-పశు సంవర్ధక శాఖకు మధ్య వారధిలా పనిచేస్తున్నారని అన్నారు.

పశువులకు వైద్య సేవలు, పశు పోషణపై అవగాహన కల్పిస్తూ పశూత్పత్తుల మార్కెటింగ్ సమాచారం, పశువుల బీమా మొదలైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఎట్ ఎగ్లాన్స్ నివేదిక ప్రకారం తెలంగాణలో ఉన్న సుమారు 3.5 కోట్ల మూగజీవాలకు మసూచి, గాలికుంటు, నీలి నాలుక, గొంతువాపు, మూతి, కాలి పుండ్ల వంటి పన్నెండు నుండి 20 రకాలవ్యాధులకు, వైరస్లకు క్షేత్రస్థాయిలో చికిత్స చేస్తున్నారన్నారన్నారు. పశుగణన కోసం పశువుల కుట్యాగులు వేస్తూ, పశువుల గాయాలకు డ్రెస్సింగ్ చేస్తూ క్రమానుసారంగా నట్టల మందు, వాక్సినేషన్ చేస్తూ పశువుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తూ ఉంటారన్నారు. పశుమిత్రలు పశువులకు వైద్యం చేస్తున్న క్రమంలో పశువుల దాడులకు గురవుతూ, వాటికి సోకిన వైరస్ వీరికి కూడా సోకుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనిచేస్తున్నారన్నారు.

దేశ ఉత్పత్తిలో రెండవ భాగంగా ఉన్న పశు సంపదను పరిరక్షిస్తున్నపశుమిత్రలకు ప్రభుత్వం ఎలాంటి వేతనం గానీ, పని భద్రత లేకపోవడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి ఎలక్ట్రానిక్ బైక్ లు, యూనిఫామ్, మాస్కులు, మందులతో కూడిన కిట్లు, పనిభద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో పశుమిత్రల సంఘం జిల్లా నాయకుల సరళ, స్వరూప, సంధ్య ,అనిత, మనీలా , స్వప్న, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ధరణి పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లు-2024 పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ వెబ్సైట్ **www.ccla.telangana.gov.in** ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కమిషనర్ నవీన్ మిట్టల్ వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనాసరే తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చని అన్నారు.

అనంతరం ఆయా మండలాల తహశీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తూ జిల్లాలోని బచ్చన్నపేట, లింగాలగణపురం, రఘునాథపల్లి, చిల్పూర్, పాలకుర్తి మండలాలలో ధరణి సమస్యల అధికంగా ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం మండల స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహించి జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లు తగ్గించాలన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలని, సీసీఎల్ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండెన్సీ పూర్తి చేయాలని సూచించారు. తహశీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వారం 10రోజుల్లోపు క్లియర్ చేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాల వారిగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, సుదీర్ఘకాలం నుండి పెండింగ్‌లో ఉన్న వాటిని ముందుగా పరిశీలన జరిపి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతి గురించి రోజువారీగా పరిశీలన జరపాలని ఆర్డీఓలకు సూచించారు.

కాగా, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేయడం జరుగుతోందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. అర్జీల పరిష్కారానికి చేపట్టిన చర్యలను తెలియజేస్తూ ఆన్లైన్ లో అప్లోడ్ చేసే సమయంలో వివిధ అంశాలను సవివరంగా పేర్కొనాలని అన్నారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను పొందుపర్చాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఆర్డీఓ డిఎస్. వెంకన్న, అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనపై ఇజ్రాయెల్ దాడి అప్రజాస్వామ్యమికం

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



నవతెలంగాణ-జనగామ

పాలసీనపై దురాక్రమణఉద్దేశంతో అమెరికా సామ్రాజ్యవాద అండతో ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి మోకు డిమాండ్ చేశారు. పాలస్తినపై ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద దాడిని ఖండిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకార్యదర్శి కనకారెడ్డి మాట్లాడుతూ పాలస్తీన దేశాన్ని ఆక్రమించుకోవడానికి దురాక్రమణ పద్ధతిలో ఇజ్రాయిల్ అమెరికా సామ్రాజ్యవాద అండతో పాలస్తీనాపై యుద్ధం చేయడం ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. అక్రమంగా యుద్ధం చేయడం వలన పాలస్తీనాలో పౌరులు చిన్న పిల్లలు చనిపోవడమే కాకుండా పెద్దఎత్తున ఆస్తులు అవుతున్నాయన్నారు. ఈ మారణహోమాన్ని అంతర్జాతీయ సంస్థ చొరవ తీసుకొని యుద్ధాన్ని ఆపాలని కోరారు. అలాగే భారత ప్రభుత్వం కూడా పాలస్తినా కు మద్దతుగా నిలబడాలని ఇజ్రాయెల్ దుర్మార్గాన్ని ఖండించాలని ఈ సందర్భంగా కోరారు. శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలి తప్ప యుద్ధం చేయడం వలన పెద్దఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. ఈ ప్రభావం ప్రపంచ దేశాలపై కూడా పడుతుందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదులు తయారు చేసిన ఆయుధాలను అమ్ముకోవడానికి దేశాల మధ్య యుద్ధాలు సృష్టిస్తూ మారన హోమానికి పాల్పడుతుందని విమర్శించారు. ప్రజాస్వామ్యవాదులు అమెరికా దుర్మార్గాన్ని ఎండగట్టాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, నాయకులు వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం, రామావత్ మీట్యనాయక్,అజ్మీర సురేష్, పల్లెర్ల లలిత, కొండ వరలక్ష్మి, తాండ్ర ఆనం దం, గుండెల్ని రాజు, కూరాకుల శ్రీను, ఎండి మైబెల్లి, చిదిరాల ఉపేందర్,పాము శ్రీకాంత్, సుమ, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల క్రమబద్ధీకరణ చర్యలు : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

సరళీకత చెల్లింపు పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు పురపాలక పరిపాలన , పట్టణాభివద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిషోర్‌తో పాటు ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో సరళీకత చెల్లింపు పథకం (ఎల్ఆర్ఎస్) ద్వారా భూములు క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల పరిధిలో 61 వేల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కార దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రభుత్వభూములను కాపాడుతూనే ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా కమిటీలను రూపొందించాలని, అందుకు రెవెన్యూ మున్సిపాలిటీ ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా బృందాలుగా ఏర్పడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్రమబద్ధీకరణ క్రమంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగినచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అవసరమైతే అదనపు బృందాలకు సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ అధికారిని తదితరులు పాల్గొన్నారు.

పేద బిడ్డలకు అండగా మహాత్మా హెల్పింగ్ హాండ్స్

- విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



నవతెలంగాణ-పాలకుర్తి

పేద బిడ్డలకు అండగా నిలిచేందుకే మహాత్మా హెల్పింగ్ హాండ్స్ ఏర్పడిందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల కేజీబీవీకి మహాత్మా హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్ ఆధ్వర్యంలో సుమారు రూ.2.50 లక్షల విలువైన డ్యూయల్ డెస్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి బహుకరించారు. జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికల, బాలుర గురుకుల పాఠశాల ల్లో పదవ తరగతి ఇంటర్మీడియట్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం గురుకుల పాఠశాల ప్రత్యేక అధికారి బైరపాక నవీన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిలు మాట్లాడుతూ పేద బిడ్డలకు సేవ చేసేందుకు గ్రామీణ పేదలకు అండగా నిలిచేందుకు మహాత్ముల వారసుడిగా గంట రవీందర్ ప్రజల మధ్య నిలిచాడని కొనియాడారు. దాతల సహాయ సహకారాలను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగినప్పుడే దాతల సహాయానికి సార్థకత ఉంటుందన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంత పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి విద్యాభివద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు.

విద్యాభివృద్ధి కోసం బడ్జెట్లో రూ.22 వేల కోట్లను కేటాయించారని అన్నారు. ప్రైవేటు విద్యకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు విద్య అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అధునాతనంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.రామునాయక్, మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య, ఎంపీడీవో రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

- నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం
- పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి





నవతెలంగాణ-పాలకుర్తి

అర్హులైన పేదలందరికీరాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలును అందించి అండగా నిలువడమే లక్ష్యమని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన పేదలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీతోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తామని తెలిపారు. పేదల అభ్యున్నతి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందని తెలిపారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గంవర్గానికి 10 కోట్ల నిధులు మంజూర మండలంలోని పాలకుర్తి, వావిలాల, కొండాపురం గ్రామాల్లో పలు అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. పాలకుర్తి పాలకుర్తి మండలానికి రూ.2 కోట్ల నిధులను మంజూరు చేశామని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి పెద్దతండ కే లో రూ.5 లక్షల నిధులను కేటాయించామని తెలిపారు. పాలకుర్తి పెద్దమ్మ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు పలు గ్రామాల్లో వివిధ సామాజిక వర్గాల కమ్యూనిటీ హాల్ నిర్మాణాల కోసం శంకుస్థాపనలు నిర్వహించామన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్ అనారోగ్యంతో బాధపడుచుండగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని లక్ష్మీనారాయణ పురం గూడ జయలక్ష్మీ మృతి చెందడంతో ఎమ్మెల్యే కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్‌ఐ రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్చార్జి హనుమాండ్ల తిరుపతి రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగానే కుమారస్వామి గౌడ్, నాయకులు మహేందర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, భాస్కర్, ఈ కార్యక్రమంలో నిరంజన్ రెడ్డి, జలగం కుమార్, బండిపెల్లి మనమ్మ, పెనుగొండ రమేష్, సలేంద్ర సంపత్, కమ్మగాని ఆంజనేయులు, వెంకన్న, గాదెపాక భాస్కర్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొడకండ్ల : ప్రజా సంక్షేమమే ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుల సురేష్ నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల : మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 62 మంది లబ్ధిదారులకు మొత్తం 17 లక్షల 34వేల500 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను, కళ్యాణ లక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, నాయకులు కాసారపు ధర్మారెడ్డి ,తోటకూరి పాండుకష్ణ ,రెడ్డిరాజుల రమేష్ ,ఓడపల్లి రవీందర్, పులిగిల్ల వెంకన్న, కాడబోయిన గణేష్, సజ్జన్, భువనగిరి యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తొర్రూరు



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా చైర్ పర్సన్స్, వైస్‌చైర్ పర్సన్స్, స్థానిక కౌన్సిలర్లు కూడా భాగస్వాములను చేస్తూ పారిశుధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యాలుగా స్వచ్ఛదనం, పచ్చదనం 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పి.శాంతికుమార్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వార్డుల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక పై ప్రతి నెల 3వ శనివారం స్వచ్ఛదనం పచ్చదనం రోజుగా నిర్వహిస్తామన్నారు. వన మహోత్సవం క్రింద మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేయాలని, పట్టణాలలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం పట్టణాలలో చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు, షెడ్యూల్‌ను వివరించారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మానస, వెన్నెల, మేనేజర్ కట్టస్వామి, హెల్త్ అసిస్టెంట్ రాజు, సూపర్‌వైజర్ వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లికుదురు:



రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ధనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి మరియన్న, ఎంపీడీవో బాలరాజులు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల్ లెవెల్ అధికారుల తో కలిసి శనివారం సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పట్టణాలలో నిర్వహించే స్వచ్ఛధనం- పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల్ లెవెల్ అధికారులు గ్రామ ప్రత్యేక అధికారులు పంచాయితీ కార్యదర్శులకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు కార్యక్రమంపై అవగాహన కల్పించి దిశనిర్దేశం తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు ఎంపీఓ బానోతు పద్మ, ఎసిడి విజయలక్ష్మి, వైద్యాధికారి ప్రియాంక, పశువైద్యాధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు5 నుండి 9 వరకు

స్వచ్ఛ దానం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలి

నవతెలంగాణ-మరిపెడ



ఆగస్టు 5 నుండి 9 వరకు అన్ని గ్రామాలలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలని మరిపెడ ఎంపీడీవో పి.విజయ పిలు పునిచ్చారు. శనివారం మరిపెడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో అధికారులకు దిశ నిర్దేశాన్ని జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత... పచ్చదనాన్ని ప్రోత్సహించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి స్వచ్ఛదానం - పచ్చదనం... కార్యక్రమాన్ని ఈనెల5 నుండి 9 వరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈకార్యక్రమం నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందికి, విద్యా శాఖ, పంచాయితీ కార్యదర్శులు, అంగన్వాడీ, ఆశ, ఉపాధిహామీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది కి అవగాహన కల్పించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలన్నారు ఇప్పటికే టెలికాన్ఫరెన్స్ లలో గ్రామీణ పరిస్థితులను ప్రభుత్వం అంచనా వేసిందని ఈనేపథ్యంలో వనమహోత్సవం క్రింద మొక్కలు నాటించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుటకు పారిశుధ్య పనులను వేగవంతంగా నిర్వహించి, షెడ్యూల్ ప్రకారం రోజువారీ కార్యక్రమాలు నిర్వహించి అట్టి వివరాల్ని రిపోర్టు పంపించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఇట్టి కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కె.కృష్ణమూర్తి, మహబూబాబాద్ జిల్లా వెటర్నరీ అధికారి ఏ కుమారస్వామి, స్వచ్ఛదనం పచ్చదనం ప్రోగ్రాం అధికారి ఎంపీడీవో పి.విజయ, ఎంపీఓ ధారావత్ సోమ్లానాయక్, సీడీపీవో ఎం.ఎల్లమ్మ, ఏపిఓ మంగమ్మ ఐకెపి ఏపీఎం రాములు నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, గ్రామ ప్రత్యేకాధికారులు వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

గిరిజన మోర్చా అధ్యక్షులుగా మోతీలాల్ నాయక్ నియామకం

నవతెలంగాణ-గూడూరు



మహబూబాద్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులుగా వాంకుడోత్ మోతీలాల్‌నాయక్‌ను నియమిస్తూ హైదరాబాద్‌లో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర గిరిజన అధ్యక్షులు కళ్యాణ్ నాయక్ చేతులమీదుగా నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ తమ పై నమ్మకాన్ని ఉంచి పదవి బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర గిరిజన అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్‌కు, తన నియామకానికి సహకరించి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు, జిల్లా అధ్యక్షులు వైవీ రావులకు , గూడూరు మండల మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న లకు కృతజ్ఞతలు తెలిపారు. మహబూబాద్ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షులుగా కొనసాగిన గూగులోత్ రాంబాబు నాయక్ ను ఖమ్మం జిల్లా గిరిజన మోర్చ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలను అప్పగించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

నవతెలంగాణ-గూడూరు



విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, ఎలాంటి అంతరాయాలు కలగకుండా వినియోగదారులకు విద్యుత్తు అందించేలా చర్యలు చేపట్టాలని మహబూబాబాద్ జిల్లా ఎస్సీ జలగం నరేష్ అన్నారు. శనివారం గూడూరు, అయోధ్య పురం, సెక్టార్ల పరిధిలోని విద్యుత్ సిబ్బందితో గూడూరులో సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యుత్ సిబ్బందికి పలు సూచనలు అందజేశారు ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లన్నింటిని వెంటనే సరిచేయాలని సిబ్బందికి సూచించారు విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మహబూబాద్ జిల్లా డిఈ విజయ్, కన్‌స్ట్రక్షన్స్ డిఈ హరి ప్రసాద, గూడూర్ ఏడీఈ కవిత, ఏడిఈ, ఏఏవో, రమేష్ ఏఈలు అమ్ములు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వారికే ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ- దంతాలపల్లి

కాంగ్రెస్ పార్టీలో 2014 నుంచి కష్టపడి పనిచేసిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలని దాట్ల గ్రామ యువజన సంఘం నాయకుడు సంపేట సురేష్ అన్నారు . ఈసందర్భంగా శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ కార్యకర్త సెను రాజేశ్ సహకారంతో ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటూ తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించడం కోసం ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా, అక్రమ కేసులను పెట్టినా తట్టుకొని సొంత డబ్బులు ఖర్చుపెట్టుకుని ఇన్ని రోజులు కార్యకర్తగా.సోషల్ మీడియా వారియర్ గా. పదవుల కోసం కాకుండా నా కాంగ్రెస్ పార్టీ కోసం జెండా మోసీ పని చేసి ఇప్పుడు యువత కోసం వారి సమస్యల పరిస్కారం కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడానికి మీలో ఒకడిగా యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో దంతాలపల్లి మండల అధ్యక్ష పదవికి నామినేషన్ వేసిన మీ అందరి సహకారంతో పార్టీ కార్యకర్తలు, మద్దతు తెలిపి సహకరించాలని కోరారు.

బైండ్ల కులస్తులను ఎ-కేటకిరిలోకి చేర్చాలి

ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి

నవతెలంగాణ-నెల్లికుదురు



రాష్ట్రంలో బైండ్ల కులస్తులు బి కేటగిరి లో ఉన్నా వారిని తక్షణమే ఏ కేటగిరీలోకి చేర్చినట్లయితే బైండ్ల కులస్తులకు న్యాయం చేకూరుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు శనివారం ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిలకర యాలాద్రి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బైండ్ల కులం గతంలో బీ కేటగిరీలో ఉండేది అట్టి దానిని ఏ కేటగిరీలోకి మార్చినట్లయితే ఎంతోమంది నిరుపేద బైండ్ల కులస్తులకు న్యాయం జరుగుతుందని కోరినట్లు తెలిపారు బైండ్ల కులం చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. బైండ్ల కులంలో నిరక్షరాస్యులు ఎక్కువ ఉండి అక్షరాసులుగా తక్కువ ఉన్నారని, అది నిరుపేద కుటుంబంలో ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు మా బైండ్ల కులం అభివృద్ధి చెందాలంటే అసెంబ్లీలో మా సమస్యపై అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తే మాకు కొంత న్యాయం జరుగుతుందన్నారు. దీనికి మీ వంతు కృషి చేయాలని మహబూబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను కోరినట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యంపై పట్టింపు లేని తెలంగాణ ప్రభుత్వం



ఆస్పత్రిని సందర్శించడమేనా..? వైద్యుల నియామకం ఉందా..?

సీపీఐ(ఎం) అధ్వర్యంలో సీహెచ్‌సీ ఆస్పత్రి ఎదుట అందోళన

నవతెలంగాణ-గార్ల:

ఏజెన్సీ మండలంలో సీజనల్ వ్యాధులతో అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి, అధికారులకు పట్టింపు లేదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక సీహెచ్‌సీ హాస్పిటల్‌లో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) అధ్వర్యంలో శనివారం హాస్పటల్ ఎదుట రోగులతో కలిసి అందోళన నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అసలే ఏజెన్సీ మండలం నలభై వేల మందికి పైగా జనాభా కలిగిన మండలంలో గత నెల రోజుల నుండి విషజ్వరాలు, కీళ్ళ నొప్పులతో ప్రజలు అవస్థలు పడుతూ నిత్యం హాస్పటల్‌కు వందలమంది రోగులు వైద్యం కోసం వస్తున్నారన్నారు. హాస్పటల్ లో ఒక్కరే వైద్య అధికారి ఉండటం వలన కొద్ది మందికి మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయని, ప్రాణాలు కాపాడుకోవటానికి జ్వర పీడితులు ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వేలాది రూపాయలు ఖర్చులు చేస్తూ అప్పుల పాలతున్నారని ఆవేదన వెలిబుచ్చారు .ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులు ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్దాయిలో వైద్యులు లేకపోవడం వలన గతంలో అనేక సార్లు సకాలంలో వైద్యం అందక అనేక మంది చనిపోయిన ఘటనలు ఉన్నాయని, అయినా ప్రభుత్వ అధికారులలో ఏ మాత్రం చలనం లేదని వాపోయారు. వైద్యుల నియామకం కోసం ఎన్ని సార్లు అందోళన లు, ధర్నా లు చేసినా పట్టించుకోవడం లేదని రోగులు ఏంచేస్తే వైద్యులను నియమిస్తారో అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, స్దానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీహెంచ్‌వోలు స్పందించి వైద్యులను నియమించాలని డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారి హన్మంతరావుకు అందించారు. ఈఅందోళనలో సీపీఐ(ఎం) జిల్లా, మండల నాయకులు భూక్య హరినాయక్, వీపీ వెంకటేశ్వర్లు, అలవాల సత్యవతి, అంబటి వీరాస్వామి, సీహెచ్.మౌనిక, మౌలానా, జి.వీరభద్రం, ఎస్.నాగరాజు, కోటయ్య ప్రవీణ్, సర్వర్, భిక్షం, నారాయణ తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు

నవతెలంగాణ- దంతాలపల్లి



స్థానికంగా ఉండరు సమయానికి రారు... వచ్చిన ఏదో ప్రోగ్రాం అంటూ వెళుతుంటారు.. అదేమని ప్రశ్నిస్తే కొర్రీలు తప్పవు ఇది దంతాలపల్లి పీహెచ్ సీ ఆరోగ్య కేంద్రంలోని అధికారులు, సిబ్బంది పనితీరు శనివారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి, సిబ్బంది సమయపాలన పనితీరు, ఆరోగ్య సేవలపై 'నవతెలంగాణ' పరిశీలించగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు లోపాలు వెలుగు చూశాయి. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు వారు వచ్చిందే సమయం.. చేసిందే డ్యూటీ నాణ్యత లోపం ఉన్న అలానే కొనసాగిస్తున్న వైద్య సిబ్బందిసేవలు, నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందడం లేదు. అధికారులు విధులు నిర్వహించే చోట నివాసం ఉండాలని, ప్రభుత్వ నిబంధన ఉన్నా ఎక్కడ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. దంతాలపల్లి మండలంలో పనిచేస్తున్న వైద్యాధికారి కూడా స్థానికంగా నివాసం ఉండడం లేదంటే అతిశయోక్తి లేదు. సమయపాలన గురించి పట్టించుకునే వారు లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. శనివారం ఉదయం 10:30 గంటలు దాటిన వైద్యాధికారి తో సహా ఫార్మసిస్టులు, ఇతర అధికారులు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎవరూ లేకపోగా వైద్యం కోసం వచ్చిన వారు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే కాకుండా సెలూన్ బాటిల్ పెట్టినా కూడా పూర్తయిన కాలానికి తీసే వైద్యుడు కరువయ్యాడు. దీంతో సిబ్బంది రాకపోవడం ఒక కారణమైతే వచ్చిన సిబ్బంది కూడా నిర్లక్ష్య ధోరణి చూపిస్తున్న ప్రదర్శన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇలా వైద్యం అందిస్తున్న విధానాన్ని చూసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమయపాలన పాటించని సిబ్బంది, డ్యూటీలో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, వైద్యానికి వచ్చిన బాధితులు, ప్రజలు, సామాజిక సేవ కార్యకర్తలు, రాజకీయ నాయకులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో.. ముందున్న సేను రాజేష్..





నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉంటూ సేవలు

సొంత ఖర్చులతో అనేక సేవా కార్యక్రమాలు

ఆయనను తలుచుకుంటున్న మండల ప్రజలు

నవతెలంగాణ- దంతాలపల్లి

చదువుకునే రోజులు కావచ్చు, బయట సమాజంలో కావచ్చు, ప్రతి ఒక్కరికి స్నేహితులు ఉంటారు, స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. మరికొంత ముందుకు వెళితే ఆత్మీయ విందులు చేసుకుంటారు. కాని సేను రాజేష్ మాత్రం తన సొంత డబ్బుతో సమాజ సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. తన కుటుంబంలో సమస్యలు అధిగమిస్తూ. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో 2023 సంవత్సరం నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టాడు. సేను రాజేష్ ప్రజా సేవలో దంతాలపల్లి వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి మండలంలోని ఆయా గ్రామాలకు సంబంధించిన వారిని అందులో జాయిన్ చేశారు. అందరితో స్నేహాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలకు పునాది వేశాడు. తొలుత తన తల్లిదండ్రులను, చదువు చెప్పిన గురువులను సన్మానించాడు. ఆ తరువాత పేదరికంతో ఇబ్బంది పడుతున్న పలువురికి వెయ్యిల రూపాయలు ఇచ్చి వారి జీవనోపాధికి ముందున్నాడు. దీంతో వారు వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాడు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే క్రీడల కిట్లు, మౌలిక వసతులకు ఆర్థిక సహాయం అందించాడు. మరో కొంతమందికి వైద్య ఖర్చులకు హెల్త్ క్యాంపులకు, ఆర్థిక సాయం చేశాడు. ప్రతి పండుగలకు పేదలకు దుప్పట్లు నిత్యవసర వస్తువులను పంపిణీ చేశాడు. గ్రామ పారిశుధ్య కార్మికులను సత్కరించాడు. అయితే ఏ ఒక్క కార్యక్రమానికి దాతల సహకారం తీసుకోలేదు. ఇప్పుడున్న ప్రపంచంలో స్వార్థం కోసం జీవిస్తున్న వారి సంఖ్య ఎక్కువ అయినా కాని ఇలాంటి మానవత్వం చాటు సమాజానికి సేవ చేస్తున్న ఈ సేను రాజేష్ అభినందనీయుడే.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్ రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు

నవతెలంగాణ-బయ్యారం:



రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న రూ.8500 కోట్ల స్కాలర్‌షిప్స్, మరియు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్కాలర్షిప్స, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పెండింగ్ లో ఉండడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే స్కాలర్షిప్ ఫీజు రీయింబర్సమెంట్ విడుదల కాకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను దగ్గర నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నాయన్నారు. కెసిఆర్ ప్రభుత్వం కూడా ఇలా వ్యవహరించినందుకే విద్యార్థులు బుద్ధి చెప్పారని రేపు రేవంత్‌రెడ్డి కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలక్షన్లలో విద్యార్థులు బుద్ధి చెబుతారన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్స్, రీయింబర్సమెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, లోకేష్, రహీం, మహేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-చిన్నగూడూరు



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని యేఊఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ చిన్న గూడూరులో విద్యారంగం అభివృద్ధి చెందుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మండలంలో ఉన్నటువంటి సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని, విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు, కార్యదర్శులు రాజేష్, సందీప్, సుధీర్, ప్రణయ్, సంజయ్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

నవతెలంగాణ-గార్ల:

ఈనెల 5వ తేది నుండి 9వ తేదీ వరకు మండలంలో జరగనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం లో అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని జిల్లా డీపీవో హరిప్రసాద్ కోరారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో మంగమ్మ అధ్యక్షతన జరిగిన వివిధ శాఖల అధికారులకు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం యాక్షన్ ప్లాన్ అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అదేశాల మేరకు అయిదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో వీధులు, బహిరంగ ప్రాంతాలను శుభ్రపరచడం, అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగనవాడీ సెంటర్ లు, హాస్టల్‌లు, పిహెచ్‌సీలు, బస్‌స్టాప్‌లు శుభ్రం చేయడం జరుగుతుందని చెప్పారు. వాటర్ ట్యాంక్‌ల శుద్ధీకరణ, ప్లాస్టిక్ వాడకంపై ప్రజలు అవగాహన కార్యక్రమం లాంటి తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అధికారులు ప్రజలందరిని భాగస్వామ్యులు చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈసమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్‌నాయక్, వివిధ శాఖల అధికారులు ఎఈ వసుంధర, సృజన్ స్వరూప్, నరేందర్, ఇస్మాయిల్, కిషన్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు, తదితర శాఖలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-తొర్రూరు

పట్టణం లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో శనివారంశ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి మంగళ శాసనాలతో వికాస తరంగణి తొర్రూర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ ప్రియ హాస్పటల్ డాక్టర్ అనిల్ కుమార్ భుక్యా సహకారంతో ఉచిత బిపి, షుగర్ నిర్ధారణ శిబిరాన్ని స్థానికంగా నిర్వహించారు. ఈఉచిత వైద్య శిరానికి అనూహ్యస్పందన వచ్చింది. శిబిరంలో 202 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించగా 134 మందికి షుగర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. ఈ శిబిరాన్ని ఉద్దేశించి ప్రముఖ వైద్యులు రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ షుగర్ వ్యాధి వయోపరిమితి కాకుండా అన్ని వయస్సుల వారికి వస్తుందన్నారు. వ్యాధులు రాకముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు డాక్టర్ కుందూరు రాజేందర్‌రెడ్డి, వికాస తరంగిణి కో ఆర్డినేటర్ కుందూరు గీతారెడ్డి, డాక్టర్ బి.అనిల్ కుమార్, డాక్టర్ కె.యాదగిరి రెడ్డి, తమ్మెర వీరభద్ర రావు, తుమ్మెటి వెంకట్ రెడ్డి, వుమ్మడి రాంబాబు, చలువాది సత్యనారాయణ, నాళ్ళ కృష్ణమూర్తి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామ వైన్స్ షాపు లో చోరి..

నవతెలంగాణ-గార్ల:

మండల కేంద్రం లోని డోర్నకల్ వెళ్ళే మార్గంలో ఉన్న శ్రీరామ వైన్స్ షాపు లో చోరి జరిగిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రోజు లాగానే షాపు ముగించుకుని ఇంటికి వెళ్ళిన షాపు నిర్వహకులు శనివారం షాపు కు రాగానే షాపులో చూడగా షాపు వెనుక భాగంలో ఉన్న డోర్ ను రాడ్ తో తొలగించి షాపు లో ఉన్న సుమారుగా రూ.3వేలరూపాయలు నగదు, లెనోవా ల్యాప్ ట్యాప్, సిసి పుటేజి, డివిఆర్ లు చోరికి గురైనట్లు తెలిపారు. చోరి జరిగిన షాపు ను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్సై జీనత్ కుమార్ జిల్లా కు చెందిన క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు. షాపు సమీపంలో డీవీఆర్‌ను గుర్తించి సీసీ పుటేజిని పరిశీలించగా చోరి చేసిన వ్యక్తి చింత అశోక్ అని గుర్తించినట్లు తెలిపారు. అర్వపల్లి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్ కుమార్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై.. పోలీసుల దాడులు

నవతెలంగాణ-బయ్యారం:

మండలంలోని కిష్టాపురం గ్రామంలో శనివారం గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరి పై కేసు నమోదు చేసి, గుడుంబా, గంజాయి, సైబర్ నేరాలపై, రోడ్డు భద్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సిఐ రవి కుమార్, ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తి:

మండలంలోని మర్రికుంటతండా, మీట్యతండాలో గుడుంబా స్థావరాలపై నెల్లికుదురు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని,3,500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే వస్తువులను, పాత్రలను కూడా ధ్వంసం చేశారని నెల్లికుదుర్ ఎస్సై రమేష్ బాబు తెలిపారు. అదేవిధంగా ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈదాడుల్లో ఎస్ఐ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొని గ్రామంలో గుడుంబా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గూడూరు:

మండలంలోని ఎర్రగుంట తండాలో శనివారం ఉదయం పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో2000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం. చేశారు. 60 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. తండాకు చెందిన జాటోత్ నగేష్, బానోత్ రాంజీ, సునీత, మంగమ్మ లావుడ్య సక్రు, మూడు బద్రి, ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ ఎక్సైజ్ శాఖ అధికారులు తండవాసులకు అవగాహన కల్పించారు. నాటు సారాయి తయారుచేసినా, రవాణా చేసినా, అమ్మిన అలాగే నాటు సారాయికి నల్ల బెల్లం అమ్మినా, రవాణా చేసినా, మారిన చట్టాల ప్రకారం కఠినంగా శిక్షలు పడతాయన్నారు .గంజాయి, డ్రగ్స్ లాంటి వాటి వలన యువత చెడిపోవద్దని మంచిగా చదువుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈదాడులలో గూడూరు సిఐ బాబురావు, ఎక్సైజ్ సీఐ భిక్షపతి, గూడూరు ఎస్ఐ నగేష్, పోలీస్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవంగర:

మండలంలోని బొత్తలతండా, కంద్య తండా లోని గుడుంబా స్థావరాలపై ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆయా తండాలకు చెందిన గుగులోతు రాములు, ధరావత్ సేత్రామ్ వద్ద నుంచి 30 కేజీల నల్ల బెల్లం, 20 కేజీల పటిక, 25 లీటర్ల గుడుంబా ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లం పానకం పారబోసి, ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాలు, తండాల్లో తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుళ్ల సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది ఆటో డ్రైవర్లకు జర్కిన్లు పంపిణీ...

నవతెలంగాణ-గూడూరు



గూడూరు గ్రామపంచాయతీ 22 మంది సిబ్బందికి, ఆటో డ్రైవర్లకు జర్కిన్లను జిల్లా కార్యదర్శి వాంకుడోత్ కొమ్మాలునాయక్ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. ఈకార్య క్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టి వెంకన్న , మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి , జిల్లా సహ కారదర్శి అక్రెమ్ వీరస్వామి, గూడూరు టౌన్ ప్రెసిడెంట్ రాస మల్ల యాకయ్య, మండల ప్రచార కమిటీ ఎలమందల శ్రీనివాస్, టౌన్ కార్యదర్శి సూర శ్రీను, మైనార్టీ మండల ప్రధాన కార్యదర్శి హుస్సేన్, మండల సీనియర్ నాయకులు రాసమల్ల రాములు, బుర్ర జోగయ్య, ఏదుల ఆదినారాయణ, మండల శ్రీను, గూడూరు మండల్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ కిషన్‌నాయక్, మండల నాయకులు సోమన్న, మాజీ వాంకుడోత్ వార్డ్ మెంబర్, పీసా చట్ట ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, మాజీ వార్డ్ మెంబర్ వాంకుడోత్ రవి, వాంకుడోత్ శ్రీను, శ్రీనివాస్ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నాగలి వీరస్వామి, ఆటో యూనియన్ అధ్యక్షుడుతంగేళ్లపల్లి కృష్ణ, జిపి కార్మికులు పూల వెంకన్న, బత్తుల వెంకన్న కాసిం, వీరమల్లు, మొదలైన కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ పట్టణంలోని సాయి మందిర్, పత్తిపాక ఫీడర్ లైన్ మీద ఉన్న చెట్టు కొమ్మలు తొలగిస్తున్నందున ఆ ప్రాంతంలో నేడు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ ఏఈ నవ్య శ్రీరెడ్డి తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని పులి గోపాల్ రావు నగర్, బంధం చెరువు, రెడ్డి బజార్ ప్రభుత్వ ఆస్పత్రి, రామ్ మందిరం, కొరివి గేటు, అయ్యప్పనగర్, సాలార్ తండా ప్రాంతాలలో ఉదయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆమె తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-గార్ల:



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ద్వారా మంజూరైన రూ.19500 సియం రిలీఫ్ ఫండ్ చెక్కు ను మండలంలోని గండి తండా కు చెందిన బాధితుడు జి.సుమన్‌కు స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో శనివారం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. ఈసందర్భంగా బాధితుడు సుమన్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. చెక్కు పంపిణీ చేసిన వారిలో రెడ్ స్టార్ బ్లడ్ డోనర్స్ క్లబ్ కన్వీనర్ చింత కొండల్ రావు, నాయకులు అంబటి వీరాస్వామి, మల్లయ్య వి.చందు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి..

నవతెలంగాణ- మరిపెడ

విద్యుదాఘాతంతో పాడి గేదే మృతి చెందిన సంఘటన మండలంలోని వీరారం శివారు బాల్యతండాగ్రామపంచాయతీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో మేతకు వెళ్లిన గేదె కరెంటు వైర్లు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. సుమారు ఎనభైవేల రూపాయల విలువచేసే పాడిగేదె మృతి చెందడంతో బాధిత రైతు బోడ అమర్ సింగ్ కన్నీటి పర్యంతమయ్యారు.విద్యుత్ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా గాని ట్రాన్సఫార్మర్,వైర్లను సరి చేయలేదని స్థానికులు చెప్పారు. ప్రభుత్వం నిరుపేద రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు

6

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్-ములుగు

ఆదివారం ఆగస్టు 4, 2024 www.navatelangana.com

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-నెక్కొండ

నెక్కొండ మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సొసైటీ చైర్మన్ రావుల చిన్న మల్లారెడ్డి సతీమణి రావుల లక్ష్మి ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం పరామర్శించి సంతాపం తెలిపారు. సూరిపెల్లికి చెందిన పసునూరి శ్రీలత మరణించగా పూలమాలవేసి సంతాపం ప్రకటించి బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి పెండం రామానంద్, తక్కళ్లపెల్లి రవీందం రావు, నెక్కొండ, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్లు రావుల హరీష్ రెడ్డి, పాలయి శ్రీనివాస్, మండల



కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా శ్రీపాల్ రెడ్డి, చెన్నకేశవులు, సాయికష్ణ, రావుల మధుకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, రావుల తిరుపతిరెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని దౌలత్‌నగర్ గ్రామానికి నూతనంగా బదిలీపై వచ్చిన గ్రామ పంచాయితీ కార్యదర్శి విక్రమ్‌ను శనివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ ఉప్ప సర్పంచ్ కత్తుల పెద్ద వెంకన్న యాదవ్, మండలం బీసీ సెల్ అధ్యక్షులు బందెల వెంకన్న యాదవ్, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడెపు కుమారస్వామి, మాజీ జడ్పీ కో అప్టెడ్ సభ్యులు మహమ్మాద్ సర్వర్, జిల్లా మాజీ సోషల్ మీడియా చైర్మన్ ఎర్రబోయిన సాంబరాజుయాదవ్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని జమాల్‌పురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లా యాకయ్య, జిల్లా నర్సయ్య తండ్రి పెద్దులు ఇటీవల అనారోగ్యంతో మరణించగా శనివారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు జున్ను కనకయ్యయాదవ్‌లు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమారం మాజీ సర్పంచ్ రాపాక రేణుకానాగయ్య, జమాల్‌పురం మాజీ సర్పంచ్ జిల్లా రాములు, మాజీ ఎంపీటీసీ సరోజన లచ్చునాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-నెక్కొండ

అంతర్జాతీయ తల్లి తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పనికర అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ హేమలత తెలిపారు.గర్భిణులు, బాలింతలు, తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడంతోపాటు పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి పాలను తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ అరుణ, వివో అధ్యక్షురాలు రేణుక, సిఏ కవిత , ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.64లక్షల విలువ గల గంజాయి స్వాధీనం

ఇద్దరు అంతర్‌రాష్ట్ర స్మగర్లు అరెస్టు

వరంగల్ సీపీ అంగర్‌కిషోర్‌ఝా

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భారీ స్థాయిలో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేసారు. వీరి నుంచి సుమారు 64లక్షల విలువ గల 256 కిలోల గంజాయితో పాటు, రెండు కార్లు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో భూపాలపల్లి జిల్లా తండాకు చెందిన బానోతు బాబు కుమారస్వామి, అదే జిల్లాకు చెందిన నేరేడుపల్లికి చెందిన నస్కరి కుమారస్వామిని అరెస్టు చేసినట్టు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కమిషనర్ వివరాలు వెల్లడించారు. అరెస్టయిన నిందితులు బానోతూ బాబు కుమారస్వామి, నస్కరి కుమారస్వామిలు కారు డ్రైవర్లుగా జీవనం కొనసాగిస్తుండగా మిగితా నిందితులతో పరిచయం అయింది. ఈ పరిచయం కాస్త స్నేహంగా మారింది. వీరందరు సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా కొద్ది రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని డొంకరాయి మండలం పరిసరాల నుండి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు రహస్యంగా తరలించి గంజాయిని ఎక్కువ ధరకు విక్రయించేవారు. ఇదే తరహాలో డొంకరాయి మండలంలోని ముకుంద్‌తో పరిచయం ఏర్పడి మిగితా నిందితులతో కల్సి డొంకరాయి గ్రామంలో 256 కిలోల గంజాయిని కోనుగోలు చేసి, దాన్ని రెండుకిలోల చొప్పున 128 ప్యాకెట్ల లో ప్యాక్ చేసి కారులో డొంకరాయి నుండి భద్రాచలం, మహబూబాబాద్ మీదుగా నర్సంపేటకు వస్తుండగా పక్కా సమచారంతో శనివారం



ఉదయం టాస్క్ ఫోర్స్, నర్సంపేట పోలీసులు, తమ పరిధిలో కమలాపురం క్రాస్ రోడ్డు, నర్సంపేట దగ్గర వాహన తనీఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులను గుర్తించిన నిందితులు కారులో తప్పించుకుని పారిపోయే క్రమంలో వాహన తనీఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అప్రమత్తమయి నిందితుల కారును అడ్డగించి కారును తనిఖీ చేశారు. దీంతో గంజాయి ప్యాకెట్లను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరితో పాటు మహబూబాబాద్‌కు చెందిన జలేందర్, భూపాలపల్లికి చెందిన ఆంగోతు రాజేందర్, ముకుంద్ పరారీలో ఉన్నట్టు సీపీ చెప్పారు. నిందితులు బానోతూ బాబు కుమారస్వామి, జలేందర్‌పై గతంలో గంజాయి స్మగ్లింగ్ కేసులు నమోదుకాబడ్డాయి. ఈ ముఠా సభ్యులను అరెస్టు, గంజాయిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసిపి మధుసూదన్, కిరణ్ కుమార్ ఏసీపీ నర్సంపేట, ఇన్స్‌స్పెక్టర్లు సార్లరాజు, రమణమూర్తి, ఎస్.ఐలు శరత్‌కుమార్, భాను ప్రకాష్, రఘుపతి, ఏ.ఏ.ఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుళ్ళు అశోక్, కానిస్టేబుళ్ళు సురేష్, మహబూబ్ పాషా, నేరెళ్ళ సాంబరాజు, రాజేష్, శ్రీనివాస్, సురేందర్ శ్రవణ్ కుమార్, నాగరాజులను, నర్సంపేట పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

ఈ నెల 5నుంచి 9వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు

నవతెలంగాణ-ఖానాపురం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో, గ్రామ ప్రత్యేకాధికారులతో, పంచాయతి కార్యదర్శులతో ఎంపీడీవో ఈగల భారతి, ఎంపీఓ సునీల్ కుమార్ స్వచ్ఛతనం పచ్చదనంపై శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాలలో ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోజువారీగా పలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రోజువారీగా పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, వైద్య శిబిరాల ఏర్పాట్లు, గ్రామాలలో శిథిలవస్థలో ఉన్న భవనాలను తొలగించే కార్యక్రమాలను గ్రామ స్థాయిలలోని ప్రజలకు అవగాహన కలిగించి ప్రతిరోజు చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలను కార్యాలయంలో సమర్పించాలని కోరారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భోగ శ్రీనివాస్, డాక్టర్ జ్యోతి, ఈసీ అరుణ్ కుమార్,



పంచాయతీ కార్యదర్శులు యుగేందర్, రాంబాబు, సుధాకర్, వరుణ్, సురేష్, భరత్, హుస్సేన్, జనార్ధన్, షేక్ సుల్తానా, కల్పన, సట్ల సుప్రజ, బానోతు దివ్య, అబేద బేగం, పులి స్రవంతి, పలు గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పర్వతగిరి : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై సంబంధిత అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ శంకర్ తెలిపారు. సమావేశంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల్ కుమార్, మండల నోడల్ అధికారి జి. లింగారెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుతో మాదిగలకు న్యాయం

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఎస్సీ వర్గీకరణ అధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెట్టుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగలకు సరైన న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ మాదిగ అన్నారు. గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ 15వ డివిజన్ ఉపాధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ విలీన గ్రామాల అధ్యక్షుడు ల్యాదల్ల ఆనందం (చిన్ని) మాదిగ ఆధ్వర్యంలో శనివారం 15వ డివిజన్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేదాసి మోహన్ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ ద్వారానే మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్యా



ఉద్యోగ రంగాలలో సరైన న్యాయం దక్కుతుందన్నారు. గత 30 ఏండ్లుగా అలుపెరుగని పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో తాను భాగస్వామిని కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ నామిండ్ల క్లైమేట్ గొర్రెకుంట మాజీ సర్పంచ్ జన్ను రేణుక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

నవతెలంగాణ-వరంగల్

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై అభిప్రాయాలను ఆగస్టు 23 వరకు సమ ర్పించాలని సీసీ ఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి వరంగల్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, పెద్దపల్లి ఆసిఫాబాద్ నారాయణపేట, ములుగు, ఆదిలాబాద్, జనగామ నిర్మల్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లతో పెండింగ్ భూ సమస్యల పరిష్కారం పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పెండింగ్ ధరణి దరఖా స్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యల పై జిల్లాల వారీగా అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల ఆన్ లైన్ లో అప్ డేట్ చేసి పరిష్కరించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ కష్ణవేణి, కాలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వ నారాయణ,రమేష్, చంద్రశేఖర్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గోట్లకొండ, బడితండా గ్రామాల్లో వైద్య శిబిరాలు

నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని బడి తండా, గొట్లకొండ గ్రామాల్లో శనివారం నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య శిబిరంలో వచ్చిన రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేసినట్లు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమన్ తెలిపారు. స్టోన్ క్రషర్లు పంట పొలాల వద్ద ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పేరుతో బురిడీ

రూ.2.43 కోట్లు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో వెలుగు చూసిన వైనం

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



నవతెలంగాణ-పటాన్‌చెరు

సైబర్ నేరగాల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. చదువుకున్నవాళ్లే వారి ఉచ్చులో పడుతున్నారు. కొన్ని రోజుల కిందట పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏపీఆర్ గ్రాండ్యుయో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే ఓ ఉద్యోగి సైబర్ నేరగాల ఉచ్చులో పడి సుమారు కోటి రూపాయల మేర మోసపోయాడు. కొన్ని రోజుల వ్యవధిలోనే అదే తరహాలో అదే కాలనీకి చెందిన మరో వ్యక్తి.. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాలంటూ వచ్చిన మెసేజ్‌తో రూ.2.43 కోట్లు పోగొట్టుకున్నాడు. ఇందుకు సంబంధించి పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఏపీఆర్ గ్రాండ్యుయో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే ఓ వ్యక్తికి గత నెల ఏడో తేదీ నుంచి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలంటూ మెసేజ్‌లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాటికి ఆకర్షితుడైన అతడు ఇప్పటివరకు 22సార్లు లావాదేవీలు జరిపి.. రూ.2,43,25000 (రెండు కోట్ల 43 లక్షల 25 వేలు) ఆ ఫేక్ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టాడు. చివరకు అది ఫేక్ మార్కెట్ అని తెలుసుకున్న అతడు శనివారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన సీఐ ప్రవీణ్ రెడ్డి బాధితుడి అకౌంట్‌లోని రూ.28 లక్షలు ఫ్రిజ్ చేయించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. సైబర్ మోసాల బాధితుల్లో ఎక్కువగా చదువుకున్నవాళ్లే ఉంటున్నారని చెప్పారు. ఇలాంటి సైబర్ మోసాలకు దూరంగా ఉండాలన్నారు. ఒకవేళ మోసపోతే.. వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

డ్వాక్రా మహిళలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు

మధిర నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్

'ఇందిరా డెయిరీ'లో మహిళలను వాటాదారులుగా చేరుస్తాం : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-ముదిగొండ

డ్వాక్రా మహిళలకు రూ.20 కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఉప ముఖ్యమంత్రి మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలోని కమలాపురం, అయ్యగారిపల్లి, మల్లన్నపాలెం గ్రామాల్లో ఆయన శనివారం విస్తృతంగా పర్యటించారు. అయ్యగారిపల్లి, కమలాపురం గ్రామాల్లో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మల్లన్నపాలెంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. మధిర నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తామని, త్వరలో శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో మహిళలను పాడి పరిశ్రమలలో వాటాదారులుగా చేర్చి, పారిశ్రామికవేత్తలుగా చేసేందుకు 2014లో ఇందిరా డెయిరీని ప్రవేశపెట్టామని చెప్పారు. నియోజకవర్గంలో మహిళలకు గేదెలు అందించి వారిని పరిశ్రమలో వాటాదారులుగా చేస్తామన్నారు. ప్రజానీకానికి న్యాయం జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. విద్య, వైద్య, ప్రజా, రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్నారు. అనంతరం ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, దివ్యాంగులు, ఆర్టీసీ డ్రైవర్లు, గ్రామానికి చెందిన పలువురు సమస్యలపై భట్టికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓజాకు వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని గెస్ట్ లెక్చరర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓజాను శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. గెస్ట్ లెక్చరర్లను కొనసాగిస్తూ ఉత్తర్వులను విడుదల చేయాలని కోరారు. బదిలీల్లో డిస్టర్బ్ అయిన గెస్ట్ లెక్చరర్లను మరోచోట సర్దుబాటు చేయాలని సూచించారు. ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ల సంఘం నాయకులు కె మహేష్‌కుమార్, ఎం బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్జేడీ జయప్రదబాయిని కలిసి సమస్యలపై చర్చించారు.

సర్వోటెక్ పవర్ సిస్టమ్స్‌లో 41 శాతం వృద్ధి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) చార్జర్‌లు, సోలార్ సొల్యూషన్, పవర్ బ్యాకప్ సొల్యూషన్‌లలో ప్రముఖ తయారీదారుగా పేరుగాంచిన సర్వోటెక్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీ అత్యుత్తమ ఫలితాలను సాధించింది. 41 శాతం ఆర్థిక వృద్ధిని సాధించినట్టు శనివారం ప్రకటించింది. వినియోగదారులకు ఉత్తమమైన ఉత్పత్తులు, సేవలను అందించడానికి కట్టుబడి ఉన్నట్టు తెలిపింది. కొత్త వాటిని నిరంతరం ఆవిష్కరిస్తామని పేర్కొంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇతర ఈవీ చార్జర్ ఈఎం నుంచి 400 యూనిట్ల డీసీ ఫాస్ట్ ఈవీ చార్జర్‌లను సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రాజెక్టులను తయారు చేయడం, సరఫరా చేయడం, ఇన్‌స్టాల్ చేయడం, అమలు చేయడం జరుగుతుందని తెలిపింది.

పీజీ డెంటల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

- ఈ నెల 4 నుంచి 8 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వరంగల్‌లోని కాళోజి నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం కన్వీనర్ కోటాలో పీజీ డెంటల్ వైద్య విద్యకోసం నోటిఫికేషన్ జారీ అయ్యింది. నీట్-ఎమ్‌డీఎస్-2024 పరీక్షలో అర్హత సాధించిన వారు దరఖాస్తుకు అర్హులు. ఎమ్‌డీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇతర సమాచారం కోసం యూనివర్సిటీవెబ్‌సైట్ http://www.knruhs.telangana సంప్రదించాలని యూనివర్సిటీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి చెందాలంటే అడ్డంకులు అధిగమించాలి

పేదరికం, రుణభారం పెరుగుతోంది

- స్వదేశీ సంస్థల్లో చైతన్యం కొరవడింది
- కాలం చెల్లిన విధానాలతో వృద్ధి సాధ్యం కాదు
- ప్రపంచబ్యాంక్ తాజా నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ : రాబోయే దశాబ్దాలలో అత్యధిక ఆదాయం కలిగిన దేశాల హోదాను పొందాలంటే భారత్ సహా వందకు పైగా దేశాలు అనేక అడ్డంకులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రపంచబ్యాంక్ తెలిపింది. వరల్డ్ బ్యాంక్ ప్రపంచ అభివృద్ధి నివేదిక-2024 ప్రకారం అమెరికా తలసరి ఆదాయంలో కేవలం మూడో వంతుకు చేరుకోవాలన్నా మన దేశానికి సుమారు 75 సంవత్సరాలు పడుతుంది. అదే మైలురాయికి చేరుకోవడానికి చైనాకు 10 సంవత్సరాలు, ఇండోనేషియాకు సుమారు 70 సంవత్సరాలు పడుతుంది. ఆదాయ సముపార్జనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు ప్రపంచబ్యాంక్ అధ్యయనం కొన్ని సూచనలు చేసింది. ఇందుకోసం ఆయా ఆర్థిక వ్యవస్థల అర్ధ శతాబ్దపు పనితీరును పరిశీలించింది.

గత సంవత్సరం చివరి నాటికి ఓ మోస్తరు ఆదాయం పొందుతున్న దేశాలు (మిడిల్ ఇన్‌కమ్ కంట్రీస్) 108 ఉన్నాయి. ఇవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. ఈ దేశాల మొత్తం జనాభా ఆరు బిలియన్లు. ప్రపంచ జనాభాలో 75 శాతం ఈ దేశాల్లోనే నివసిస్తున్నారు. అయినప్పటికీ వీరిలో మూడింట రెండు వంతుల మంది పేదరికంలో మగ్గిపోతున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో అనేక సవాళ్లు ఎదుర్కోక తప్పదు. ఆ దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. రుణభారం అధికమవుతోంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. పర్యావరణ సంబంధమైన ఆందోళనలు తలెత్తుతున్నాయి.

ఆ మూడు అంశాలపై దృష్టి

వర్ధమాన దేశాలు ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని నివేదిక సూచించింది. అధిక ఆదాయం పొందుతున్న దేశంగా హోదా పొందాలంటే పెట్టుబడులు, ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంపై దృష్టి పెట్టాలని ప్రతిపాదించింది. ప్రపంచ నేతలను అనుసరించడం కంటే పరిధులు దాటి సొంత ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపింది. ఈ విధానాన్ని అవలంబించి దక్షిణ కొరియా విజయం సాధించిందని గుర్తు చేసింది. దాని తలసరి ఆదాయం 1960లో 1,200 డాలర్లు ఉంటే 2023 నాటికి 33,000 డాలర్లకు చేరిందని చెప్పింది.

ఇప్పటికీ శతాబ్దం నాటి విధానాలే

కాలం చెల్లిపోయిన విధానాలపై ఆధారపడడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోంది. ఇది వేగం పెంచే ఉద్దేశంతో కారును ఫస్ట్ గేర్‌లో నడపడం వంటిది. శతాబ్దం మధ్య నాటికి సుసంపన్నమైన సమాజాలను నిర్మించాలంటే వెనుకబడకూడదని, నూతన విధానాన్ని వైఖరిని రూపొందించుకోవాల్సి ఉంటుందని ప్రపంచబ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త ఇందర్‌మిత్ గిల్ సూచించారు. 'ఓ మోస్తరు ఆదాయాన్ని పొందుతున్న దేశాలు ఇప్పటికీ గత శతాబ్దం నాటి విధానాలనే అనుసరిస్తున్నాయి. పెట్టుబడులను పెంచడానికి రూపొందించిన విధానాల పైనే ప్రధానంగా ఆధారపడుతున్నాయి. ఇదెలా ఉన్నదంటే ఫస్ట్ గేర్‌లో కారు నడుపుతూ వేగంగా వెళ్లాలని అనుకోవడం' అని ప్రపంచబ్యాంక్ నివేదిక వ్యాఖ్యానించింది.

సంస్థల వృద్ధి రేటు తక్కువ

అమెరికా సంస్థలతో పోలిస్తే భారత్, మెక్సికో, పెరూ దేశాల సంస్థల వృద్ధి రేటు చాలా తక్కువగా ఉన్నదని ప్రపంచబ్యాంక్ నివేదిక ఎత్తిచూపింది. అభివృద్ధికి అవకాశం ఉన్న సంస్థల్లో సైతం చైతన్యం కొరవడిందని, అవి మార్కెట్ నుండి చిన్న చిన్న సంస్థలను కూడా కదిలించలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఓ మాదిరి ఆదాయం ఉన్న దేశాల్లో ఇప్పటి వరకూ కేవలం 34 మాత్రమే అధిక ఆదాయం కలిగిన దేశాల హోదాను పొందాయని, వీటిలో మూడో వంతుకు పైగా దేశాలు యూరోపియన్ యూనియన్‌లో విలీనం కారణంగానో లేదా చమురు ద్వారానో ప్రయోజనం పొందాయని వివరించింది.

నిటి ఆయోగ్ ఏం చెప్పింది?

2047 నాటికి భారత్ 3.36 ట్రిలియన్ డాలర్ల నుండి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని '2047 నాటికి వికసిత్ భారత్' పేరిట నిటి ఆయోగ్ ఇటీవల రూపొందించిన అప్రోచ్ పేపర్ తెలిపింది. తలసరి వార్షిక ఆదాయం 2,392 డాలర్ల నుండి 18,000 డాలర్లకు పెరుగుతుందని చెప్పింది.

మౌనమే సమాధానం

- ఐదేండ్లలో నిషేధానికి గురైన యూట్యూబ్ ఛానెల్‌ల సంఖ్యపై నోరు మెదపని కేంద్రం
- సభ్యుల ప్రశ్నలకు తగిన సమాధానాలివ్వలేని ప్రభుత్వం
- పత్రికా స్వేచ్ఛ, ఇంటర్నెట్ షట్‌డౌన్‌లపై ఆందోళనను తోసిపుచ్చిన మోడీ సర్కారు

న్యూఢిల్లీ : దేశంలో మోడీ పాలనలో పత్రికా స్వేచ్ఛ, ఇంటర్నెట్ షట్ డౌన్, యూట్యూబ్ ఛానెళ్లపై ఆంక్షలు అన్నీ ఇన్నీ కావు. ప్రజల గొంతును వినిపించి, ప్రభుత్వానికి ప్రతిపక్షంలా మారిన పత్రికలు, యూట్యూబ్ ఛానెళ్లపై కేంద్రం ఆది నుంచీ కక్షపూరితంగానే వ్యవహరిస్తున్నది. ఈ విషయంలో ఇటీవల పార్లమెంటు సమావేశాల్లోనూ చర్చ జరిగింది. అయితే, పార్లమెంటు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మాత్రం మోడీ సర్కారు తగిన సమాధానాలివ్వకుండా తప్పించుకున్నది.

మోడీ పాలనలోని గత ఐదేండ్లలో ప్రభుత్వం బ్లాక్ చేసిన యూట్యూబ్ ఛానెల్‌ల సంఖ్యపై కేంద్రం నుంచి ఎలాంటి సమాధానమూ రాలేదు. దీనికి సంబంధించిన డేటాను రాజ్యసభ ఎంపీ వివేక్ తంఖా అభ్యర్థించారు. అయితే కేంద్రం మాత్రం గణాంకాలు వెల్లడించకపోవటం గమనార్హం. గతనెల 22న ప్రారంభమైన పార్లమెంట్ ప్రస్తుత సెషన్‌లో పత్రికా స్వేచ్ఛ, సెన్సార్‌షిప్, ఇంటర్నెట్ షట్‌డౌన్‌కు సంబంధించిన అంశాలు వేడిని పెంచుతూనే ఉన్నాయి. లోక్‌సభ, రాజ్యసభలో కొనసాగుతున్న సెషన్‌లో పార్లమెంటు సభ్యులు (ఎంపీలు) అడిగిన ప్రశ్నల శ్రేణికి కేంద్రం విఫలమైన ప్రతిస్పందనలను అందించింది. కొత్త పార్లమెంట్ భవనం ఆవరణలోకి జర్నలిస్టుల ప్రవేశంపై విధించిన మీడియా ఆంక్షలపై జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేయటంతో పార్లమెంట్ వెలుపల కూడా పత్రికా స్వేచ్ఛ అంశం తెరపైకి వచ్చింది. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రకారం.. శాసనసభ్యులతో మాట్లాడకుండా నిరోధించటానికి పార్లమెంటు ఆవరణలో జర్నలిస్టుల కదలికలపై ఆంక్షలు విధించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ వివేక్ తంఖా.. గత ఐదేండ్లలో ఎన్ని యూట్యూబ్ ఛానెల్‌లను బ్లాక్ చేశారో వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రశ్న వేశారు. దీనికి ప్రతిస్పందనగా కేంద్రం ఈ ప్రశ్నను పూర్తిగా తప్పించింది. అలాగే, వైసీపీ లోక్‌సభ ఎంపీ మిథున్‌రెడ్డి అడిగిన మరో ఆసక్తికరమైన ప్రశ్నకు కేంద్రం నుంచి సరైన సమాధానమూ రాలేదు. టెలికాం సేవల తాత్కాలిక సస్పెన్షన్ (పబ్లిక్ ఎమర్జెన్సీ లేదా పబ్లిక్ సేఫ్టీ) రూల్స్, 2017 ప్రకారం ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేయటానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు అధికారాలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మళ్లీ తప్పుదారి పట్టించింది. వ్యక్తిగతంగా ఇంటర్నెట్ సస్పెన్షన్‌కు సంబంధించి ప్రశ్నపై కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా తప్పించుకునే ప్రయత్నమే చేశారు.

కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ విజయకుమార్.. పత్రికా స్వేచ్ఛ సూచిక 2024లో భారత్ తక్కువ ర్యాంక్‌పై కేంద్రాన్ని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించటానికి ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుందని అడిగారు. పత్రికా స్వేచ్ఛ సూచిక 2024 ఎడిషన్‌లో పరిగణించబడిన 180 దేశాలలో దేశం 159వ స్థానంలో ఉందని ప్రభుత్వానికి తెలియదా? అని కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. అయితే, వాక్, భావప్రకటనా స్వేచ్ఛలో దిగజారుతున్న పరిస్థితుల గురించిన ఆందోళనలను ప్రభుత్వం తక్షణమే తోసిపుచ్చింది. "2014-15 నుంచి ఇప్పటి వరకు గత 10 సంవత్సరాలలో రిజిస్టర్డ్ పీరియాడికల్‌ల సంఖ్య 1,05,443 నుంచి 1,51,734కి, అంటే 43.9 శాతం పెరిగింది. అదేవిధంగా, ప్రయివేట్ శాటిలైట్ టీవీ ఛానెల్‌ల సంఖ్య కూడా ఈ కాలంలో 821 నుంచి 910కి గణనీయంగా పెరిగింది. ఇందులో 393 న్యూస్ ఛానెల్‌లు ఉన్నాయి" అని కేంద్రం బదులిచ్చింది.

తల్లి హత్య కేసులో కొడుక్కి విముక్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మెదక్ జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవల్లికి చెందిన వృద్ధురాలి హత్య కేసులో ఆమె కొడుకు పోచయ్యకి హైకోర్టు విముక్తి కల్పించింది. సిద్దిపేట కోర్టు పోచయ్యకు విధించిన యావజ్జీవ శిక్షను రద్దు చేసింది. 2013లో తల్లి హత్య కేసులో పోచయ్య అప్పటి నుంచి జైల్లో ఉన్నాడు. యావజ్జీవశిక్షను సవాలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తుల ద్విసభ్య ధర్మాసనం అనుమతించింది. 82 ఏండ్ల తల్లిని పోషించలేక పోచయ్య చంపేశాడన్న పోలీసుల చార్జిషీట్ ఆధారంగా కింది కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. ఆమె హత్య జరిగినప్పుడు ప్రత్యక్ష సాక్షులు లేరని హైకోర్టు పేర్కొంటూ ఆ శిక్షను రద్దు చేసింది. గ్రామస్తులు, డాక్టరు, దర్యాప్తు అధికారి సాక్ష్యాల మేరకు కింది కోర్టు తీర్పు చెప్పడాన్ని ఆక్షేపించింది. పంచనామా సాక్ష్యాలు పోచయ్యకు వ్యతిరేకంగా లేవని, అయినా ప్రత్యక్ష సాక్షులు ఒక్కరూ లేరని చెప్పింది. ఈ కేసులో పోచయ్యను విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది.

317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జీవో 317పై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. శనివారం నాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేష్‌దత్ ఎక్కా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు శివశంకర్, బూసాని వెంకటేశ్వరరావు, ఉపసంఘ కమిటీ కన్సల్టెంట్, జాయింట్ సెక్రెటరీ సర్వీసెస్ జీ సునీతాదేవి, సహాయ కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. 317 జీవోలో స్థానికతకు సంబంధించి రెండు రకాల ప్రతిపాదనలను సాధారణ పరిపాలన శాఖ క్యాబినెట్ సబ్ కమిటీ ముందు ప్రతిపాదించింది. వీటిపై చర్చించి, ప్రతిపాదించిన అంశాలను సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి తుది నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని నిర్ణయించారు. అలాగే జీవో 46కు సంబంధించిన అంశాలపై న్యాయ నిపుణులతో చర్చించారు. దీనిపైనా తుది నిర్ణయం తీసుకోలేదు.

నౌహెరా షేక్ నివాసంలో ఈడీ సోదాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

పెద్ద మొత్తంలో వడ్డీలు ఇస్తామంటూ వేల కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన హీరా గోల్డ్ కంపెనీ యజమాని నౌహెరా షేక్ నివాసంలో శనివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోదాలు నిర్వహించారు. నగరంలోని టోలీచౌకీలో గల ఆమె నివాసంలో ఈడీకి చెందిన ప్రత్యేక బృందాలు ఉదయం నుంచి పొద్దు పోయేంత వరకు సోదాలను సాగించాయి. గతంలోనే హీరా గోల్డ్ వేల కోట్ల రూపాయల డిపాజిట్లకు కుచ్చుటోపీ పెట్టిందని నగర నేర పరిశోధక విభాగం(సీసీఎస్) కేసు నమోదు చేయగా మనీలాండరింగ్ జరిగిందంటూ ఈ కేసును తర్వాత ఈడీ దర్యాప్తును చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నౌహెరా షేక్ అరెస్ట్ కావటం, తర్వాత బెయిల్‌పై విడుదల కావటం జరిగింది. కాగా, ఈ కేసు దర్యాప్తులో భాగంగా నౌహెరా షేక్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలను నిర్వహించారు. ఈ సోదాల్లో వెల్లడైన అంశాలపై ఈడీ అధికారులు తర్వాత పత్రికా ప్రకటనను విడుదల చేసే అవకాశమున్నది.

పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద దాడి ఖండించాలి

- దురాక్రమణకు నిరసనగా ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా సంఘీభావం
- తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలి: వామపక్ష పార్టీలు సంఘీభావం

నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో



పాలస్తీనా ప్రజలపై సామ్రాజ్యవాద దాడి ఖండించాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. వారిపై సామ్రాజ్యవాద-జియోనిస్ట్ దురాక్రమణకు నిరసనగా ఎస్ఎఫ్ఐ దేశవ్యాప్తంగా సంఘీభావ దినోత్సవాన్ని నిర్వహించింది. శనివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన సదస్సుకు పాలస్తీనా రాయబారి అద్నాన్ ముహమ్మద్ అబుల్హాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఇజ్రాయెల్ జియోనిస్ట్ శక్తులు పాలస్తీనా ప్రజలపై జరిపిన దాడి అన్ని హద్దులు దాటిందని అన్నారు. దీనిపై అమెరికా యూనివర్శిటీలతో సహా వెల్లువెత్తుతున్న నిరసనలు, ఆగ్రహం ఆశాజనకంగా ఉన్నాయని అన్నారు. క్యూబా రాయబారి అబెల్ అబల్లే, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు విపి సాను, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, ఉపాధ్యక్షులు ప్రతీక్ ఉర్ రెహ్మాన్, సంగీత దాస్, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్, సెక్రెటేరియట్ మెంబర్ ఐషి ఘోష్ మాట్లాడారు.

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ ఎంఎల్ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి రవిరాయ్ మాట్లాడారు. తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించాలని, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, ఇజ్రాయెల్‌పై సైనిక ఆంక్షలు విధించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బందా కరత్ మాట్లాడుతూ పాలస్తీనాకు ఎల్లప్పుడూ సంఘీభావం ఉంటుందని, ప్రజలు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలని అన్నారు. పాలస్తీనాలోని పిల్లలు, ప్రజలపై అనాగరిక భయానక దాడి కొనసాగుతోందని అన్నారు. "భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు సైనిక వస్తువులను సరఫరా చేయడానికి అన్ని లైసెన్సులను రద్దు చేయాలి. దేశంలో తయారు చేసిన డ్రోన్‌లు, పేలుడు పదార్థాలు పంపుతున్నారు. యుద్ధంలో, పాలస్తీనాపై మారణహోమంలో ఉపయోగిస్తున్నారు" అని ఆమె పేర్కొన్నారు. ఇజ్రాయెల్ నుంచి భారతదేశం కూడా సైనిక, భద్రతా పరికరాలను దిగుమతి చేసుకుంటోందని, ఇది ఇజ్రాయెల్ తన చర్యలలో ఆర్థికంగా సహాయపడుతుందని అన్నారు. పాలస్తీనా కార్మికుల స్థానంలో ఇజ్రాయిల్‌కు భారతీయ కార్మికులను పంపినందుకు ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు. "వేలాది మంది కార్మికులు ఇజ్రాయెల్‌కు పంపారు. ఇది ఇజ్రాయెల్ జియోనిస్ట్ ప్రభుత్వం వర్ణవివక్ష విధానానికి ప్రత్యక్ష మద్దతు" అని ఆమె విమర్శించారు. గాజాలో కొనసాగుతున్న దాడిని మతపరమైన యుద్ధంగా చిత్రీకరిస్తున్నారని, ఇది నిజం కాదని అన్నారు. ప్రపంచం చూసిన అత్యంత ఘోరమైన భయానక సంఘటనలలో భారతదేశం భాగస్వామిగా ఉందని విమర్శించారు.

వంధ్యత్వంపై ఫెర్టీ9 టుగెదర్ ఇన్ ఐవీఎఫ్ అవగాహన

నవతెలంగాణ-హైదరాబాద్



ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం 2024ను పురస్కరించుకుని ఫెర్టీ9 ఫెర్టిలిటీ సెంటర్ ప్రారంభించిన వినూత్నమైన టుగెదర్ఐవీఎఫ్ ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో నిర్వహించిన ఈ ప్రచారం ద్వారా ప్రజలలో అవగాహన మెరుగుపరచడం, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్) పట్ల అంగీకారాన్ని పెంచడం లక్ష్యంగా చేసుకుంది. అదే సమయంలో వంధ్యత్వానికి సంబంధించిన అపోహలను పోగొట్టడం, తమ సంతానోత్పత్తి చికిత్స గురించి తగిన సమాచారంతో నిర్ణయాలు తీసుకునేలా జంటలను ప్రోత్సహించటం చేసింది. ఈ ప్రచారం కింద, ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవ వారంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా 15 వేర్వేరు ప్రదేశాలలో వీధి నాటకాలు లేదా నుక్కడ్ నాటకాలను ప్రదర్శించింది. తద్వారా అధిక సంఖ్య లో ప్రజలకు చేరువైంది. ఈ ప్రదర్శనలు అనుకూలమైన, ప్రభావవంతమైన పద్ధతిలో సాధారణ ప్రజల కోసం వంధ్యత్వం, ఐవిఎఫ్ పట్ల ఉన్న అపోహలను నిర్వీర్యం చేయడంలో సహాయపడ్డాయి. అలాగే, ఐవిఎఫ్ విధానాలలో సంపూర్ణత మరియు ప్రశాంతత ప్రాముఖ్యతను నొక్కిచెప్పడానికి 'మ్యూజిక్ ఆఫ్ హోప్'ను విడుదల చేసింది.

ప్రముఖ నృత్యకారిణి యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

తెలుగు రాష్ట్రాల సీఎంలు సంతాపం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రముఖ భరతనాట్య, కూచిపూడి నర్తకి యామినీ కృష్ణమూర్తి కన్నుమూశారు. 84 ఏండ్ల ఆమె వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్నారు. ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. భరత నాట్యం, కూచిపూడి నృత్యంతో ఆమె భారతదేశఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేశారు. 1940లో ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లెలో ఆమె జన్మించారు. క్షీరసాగర మథనంలో మోహినీగా, భామాకలాపంలో సత్యభామ, ఉషాపరిణయంలో ఉషగా, శశిరేఖాపరిణయంలో శశిరేఖగా ఆమె ఎన్నో నృత్యరూపకాల్లో పాత్రలను పోషించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం యామినీ సరస్వతిని సత్కరించింది. గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా సేవలందించారు. ఢిల్లీలో 'యామినీ స్కూల్ ఆఫ్ డ్యాన్స్' స్థాపించి ఎంతో మంది యువతకు భరత నాట్యం, కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చారు.

రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సంతాపం

యామినీ కృష్ణమూర్తి మరణం పట్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ఏ రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు వేర్వేరుగా సంతాపం తెలిపారు. అమెరికాలో ఉన్న రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి సంతాప సందేశం పంపారు. ఆమె భారతదేశం గర్వించదగిన గొప్ప నృత్యకారిణి అని కొనియాడారు. కళారంగంలో ఆమెలేని లోటును ఎవరూ తీర్చలేరన్నారు. ఎంతో మంది యువతకు ఆమె నాట్యం నేర్పించి దేశంలోనే కళా రంగానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారని చెప్పారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నెల్లూరులో మెడికల్ సెంటర్ ప్రారంభించిన రేలా హాస్పిటల్

నవతెలంగాణ-హైదరాబాద్



చెన్నైలోని ప్రముఖ మల్టీస్పెషాలిటీ మరియు క్వాటర్నరీ హెల్త్కేర్ సెంటర్ అయిన రేలా హాస్పిటల్, నెల్లూరు, పొరుగు జిల్లాల ప్రజలకు నిపుణుల కన్సల్టేషన్స్ మరియు ఇతర ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి నెల్లూరులో రేలా మెడికల్ సెంటర్ను ప్రారంభించింది. రెలా హాస్పిటల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రొ. మొహమ్మద్ రేలా, రెలా గ్రూప్ లోని ప్రముఖ సర్జన్లు, హెల్త్కేర్ నిపుణుల సమక్షంలో హాస్పిటల్ను తమిళనాడు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, జనరల్, వాస్కులర్ సర్జన్ ప్రొఫెసర్ సి.ఎం.కె.రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా చిత్తూరు జిల్లాకు చెందిన 8 ఏళ్ల జ్ఞాన సాయి హాజరయ్యారు. చిన్నతనంలోనే ప్రాణాంతక కాలేయ వ్యాధిని ఆమె అధిగమించింది. జ్ఞాన సాయి 2016లో రేలా హాస్పిటల్లో ప్రాణాలను రక్షించే కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స ను పొందారు, ఆమెకు కేవలం తొమ్మిది నెలల వయస్సులో ఈ చికిత్సను ప్రొఫెసర్ మహమ్మద్ రేలా నిర్వహించారు.